జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | ఆదివారం 30 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :227 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967


## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే



- వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: రాహుల్ డిమాండ్
- ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడంపై రాహుల్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరి అంటరానితనానికి మరో రూపం

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



- సరిహద్దు వెంబడి బలగాల ముమ్మర గాలింపు
- మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో డ్రోన్ గుర్తింపు
- సరిహద్దు దాటి పాక్ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి
- అనుమానాస్పద కదలికలపై ఉధంపూర్, కథువా, రాజౌరిలోనూ సెర్చ్ ఆపరేషన్లు



## మహా విధ్వంసం

- ప్రళయం మిగిల్చిన విషాదం
- సర్వం కోల్పోయి, గల్లంతైన ఆప్తుల కోసం అన్వేషిస్తున్న నేపాల్‌లోని కుటుంబాలు
- నేపాల్ ఆకస్మిక వరదలు
- 600 దాటిన మృతుల సంఖ్య
- శవాల ఫొటోల వద్ద కుటుంబాల రోదనలు
- మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి

# గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు



- మీ హెల్త్ మీ ఫోన్‌లోనే
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిది
- అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన
- గన్నెలలో 10 ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం

**అమరావతి**

ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో 10 ఆరోగ్య రథాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని స్పష్టం చేశారు. "సంజీవని" యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి - మిగతా3లో



## మరో నాలుగు లక్షల కొత్త ఇళ్లు మంజూరు

- మరో 10 రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ
- కొత్తగా 4 లక్షల గ్రామీణ ఇళ్లు
- వారం, పది రోజుల్లో మంజూరుకు అవకాశం
- పీఎంఏవై 2.0 కింద ఇచ్చేందుకు కేంద్రం సుముఖం

## బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్



- భారత్ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచన
- భారత్‌లో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ వ్యాప్తి
- అంతలోనే బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇచ్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- భారత్ వన్ హెల్త్ విధానాన్ని బలోపేతం చేయాలని సూచించిన ఆరోగ్య నిపుణులు

## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు



- వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రకటించిన ప్రభుత్వం
- సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు
- వైద్యవిద్య కోర్సుల ఫీజులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

**అమరావతి**

రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు 10 శాతం, పీజీ మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులను నిర్ణయించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు గతేడాది కంటే 10 శాతం, పీజీ కోర్సులకు, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు వెలువరించారు. ఎంబీబీఎస్ కన్వీనర్ - మిగతా3లో



## హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లో 195 హైరిస్క్ సరస్సులు
- బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు

# ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేలా..



- పిల్లల చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి
- అమరావతి ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమం
- వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు
- విజేతలకు నగదు బహుమతిని అందజేసిన ప్రముఖులు

**అమరావతి**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలు మూలల నుంచి వచ్చిన క్రీడాకారుల సందడితో ఆడిటోరియం క్రీడా సంబరాలను తలపించింది. విజేతలకు నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన క్రీడాకారులకు - మిగతా3లో

# మహా విధ్వంసం

ఆసుపత్రుల వెలుపల గోడలకు అంటించిన మృతుల ఫొటోలను చూస్తూ కన్నీరుమున్నీరు అవుతున్న జనాలు. తమ సామగ్రి కోసం బురదలో, శిథిలాల మధ్య వెతుకుతున్న కుటుంబాలు. దెబ్బతిన్న భవనాల గుండా పసిబిడ్డను ఎత్తుకొని వెళ్తున్న ఓ బాధిత మహిళ. శిథిలాల మధ్య పడి ఉన్న ఓ కుక్క కళేబరం. నేపాల్?ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు సృష్టించిన బీభత్సానికి ఇవి కొన్ని సజీవ సాక్ష్యాలు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి బంధువుల్లో ఆశలు ఆవిరి అవుతున్నాయి. మరోవైపు సహాయక బృందాలు అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ ప్రాణాలకు తెగించి బాధితుల కోసం గాలిస్తున్నాయి. బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు ఒక్కసారిగా గ్రామాలు, పట్టణాలను ఊడ్చేసింది. వరద ఉద్ధృతికి ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పెను విపత్తు నుంచి కోలుకోవడానికి ఇప్పుడు నేపాల్ తీవ్రంగా శ్రమిస్తోంది.



**భారీగా పెరిగిన మృతుల సంఖ్య**

శనివారం నాటికి నేపాల్‌లో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. పైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తరచూ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ బృందాలు ఎంతో శ్రమించి 163 మంది విదేశీయులతోపాటు, దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. తమకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారేమోననే ఆశతో పేర్లు, ఫొటోలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. బతికున్న వారి జాబితాలో తమ వారి పేర్లు కనిపించకపోవడంతో, భారమైన హృదయంతో, మరణించిన వారి ఫొటోలు ఉన్న మరో జాబితా వైపు వెళ్తున్నారు. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు చూపరులను కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా, బురదను తవ్వుకుంటూ గల్లంతైన వారి కోసం అన్వేషిస్తున్నారు.

అప్పర్ త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అక్కడ టన్నుల కొద్దీ బురద పేరుకుపోయింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లెయిన్లతో ఆ బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఆ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్?లైన్ ఖబర్? అనే న్యూస్ పోర్టల్ పేర్కొంది.

మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో విధ్వంసం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో మునిగిపోయాయి. వాహనాలు సగం వరకు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ఇక ప్రాణాలతో బయటపడిన వారికి, ఉండడానికి ఓ చోటు, వైద్యం, పోయిన సామగ్రి వెతుక్కోవడం కష్టమైపోతోంది. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల గుండా నడుస్తూ తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఒక వ్యక్తి శిథిలాల గుండా గ్యాస్ సిలిండర్? మోసుకెళ్తున్నాడు. ఎందుకంటే అతను ఆ ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అది ఒక్కటే. ఎక్కడ చూసినా దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలు కనిపిస్తున్నాయి. ఇది వరద సృష్టించిన మహా విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ బాధితులకు కాస్త ఆసరాగా మారింది. ఆర్మీ సిబ్బంది పిల్లలకు, వృద్ధులకు సాయం చేస్తున్నారు. వైద్యులు తాత్కాలిక వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్యాంప్?ల్లోనే గల్లంతైన, మరణించిన, రక్షించబడిన వారి వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం 11వేల మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు.

**మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!**

వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ఇది రెస్క్యూ సిబ్బంది పనిని మరింత కష్టతరం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, గతంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కొన్న అనుభవంతో, గల్లంతైనవారిని వెతకడం, బాధితులకు సహాయం చేయడం, పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించడంపై నేపాల్ దృష్టి సారించింది.

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు

నేపాల్‌లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్‌లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం కంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.



**దిగువ ప్రాంతాల్లో విధ్వంసం!**

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్?బర్స్ట్?ఫ్లడ్(+శ్రీూఖీ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్?లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనే సుమారు 4700 సరస్సులు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

**సౌత్ లొనాక్ విపత్తు మర్చిపోలేం**

భారత్ ఇప్పటికే ప్రమాదాన్ని చవిచూసింది. 2023 అక్టోబర్ 3వ తేదీన సిక్కింలోని సౌత్ లొనాక్ సరస్సులు వద్ద భారీ విపత్తు సంభవించింది. సరస్సులోకి భారీగా మంచు, రాళ్లు విరిగిపడటంతో ఒక్కసారిగా పెద్ద అల ఏర్పడింది. సుమారు 20 మీటర్ల ఎత్తున ఎగిసిన ఆ నీటి అల దిగువ ప్రాంతాల వైపు దూసుకెళ్లింది. ఆ వరద ప్రవాహానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటన హిమానీనద సరస్సుల ప్రమాద తీవ్రతను దేశం ముందు స్పష్టంగా ఉంచింది.

నేపాల్‌లో జరిగిన తాజా విపత్తు మరో కోణాన్ని బయటపెట్టింది. మంచు లేదా రాళ్లు విరిగిపడటం, ఆ తర్వాత భారీగా మట్టి, రాళ్ల ప్రవాహం ఏర్పడటం, తాత్కాలికంగా సరస్సు ఏర్పడటం, చివరకు ఆకస్మిక వరదగా మారడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరిగే ప్రమాదాలను క్యాస్కేడింగ్ హజార్డ్స్ అంటారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యుడు కృష్ణ వత్స ప్రకారం, ఇలాంటి పరిణామాలు చాలా వేగంగా చోటుచేసుకోవచ్చు. దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడానికి చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉంది. "ప్రస్తుతం హిమాలయాల్లో సుమారు 200 హిమానీనద సరస్సులు ఉండగా, వాటిలో కనీసం 50 నుంచి 60 వరకు అధిక ప్రమాదకరమైనవిగా వర్గీకరణ జరిగింది. ఉష్ణోగ్రతలు పెరిగి హిమానీనదాలు కరగడంతో సరస్సుల వంటి నిర్మాణాల్లో భారీ పరిమాణంలో కరిగిన నీరు పేరుకుపోతుంది. ఒకవేళ భూకంపం సంభవించినా లేదా సరస్సు గట్లలో పగుళ్లు ఏర్పడినా, ఎత్తైన ప్రదేశాల్లో ఉన్న నీరు అపారమైన వేగంతో కిందికి దూసుకువస్తుంది. ఇది ఆ ప్రవాహాన్ని ఉగ్రరూపం దాల్చే వరదగా మార్చి, దాని మార్గంలో ఉన్న ఇళ్లు, హోటళ్లు, రోడ్లు లేదా వంతెనలు వంటి ప్రతిదాన్నీ కొట్టుకుపోతుంది."

# బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్‌ఓ అలర్ట్

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జంతువులు, పక్షులలో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. బర్డ్‌ఫ్లూను ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థలను ముందస్తుగా సిద్ధం చేయాలని ఆసియా-పసిఫిక్ దేశాలకు సూచించింది. అయితే భారత్‌లో ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ (ఎ1చీ1) కేసులు పెరుగుతున్న సమయంలోనే, డబ్ల్యూహెచ్‌ఓ బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇవ్వడంతో ఈ హెచ్చరికకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆగస్టు 25- 27 వరకు డబ్ల్యూహెచ్‌ఓ ఆగ్నేయాసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయాలు సంయుక్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి ఓ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో 150 మందికి పైగా ఇన్‌ఫ్లుయెంజా నిపుణులు, సైంటిస్టులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు. పక్షులలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కొనసాగుతుందని ప్రజారోగ్య నిపుణులు పేర్కొన్నారు. జంతువుల నుంచి మానవులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈటీవీ భారత్‌లో ఆరోగ్య నిపుణులు, సైంటిస్టులు, వైద్యులు మాట్లాడారు.



**లక్షణాలు ఏంటంటే?**

బర్డ్‌ఫ్లూ సోకిన చాలా మంది రోగులలో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని అం టువ్యాధుల నిపుణురాలు, మెడికల్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ మనాలి అగర్వాల్ తెలిపారు. ఈ లక్షణాలతో పాటు న్యుమో నియాకు సంబంధించిన లక్షణాలు కూడా కనిపిస్తాయని చెప్పారు. తరచుగా కనిపించే శ్వాసకోశేతర లక్షణాలలో విరేచ నాలు, వాంతులు, కడుపు నొప్పి ఉన్నాయని వివరించారు. ఈ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడడానికి సన్నద్ధత చాలా కీలకమన్నారు. "ముందుగా బర్డ్‌ఫ్లూ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. ఇది ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఉప రకం. ఇది పక్షులు, క్షీరదాలకు సోకుతుంది. అరుదుగా మానవులకు కూడా సంక్రమిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ సోకిన పక్షులు, ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం, కలుషితమైన పరిసరాల వల్ల ఆ వ్యాధి మానవులకు సోకే ప్రమాదం ఉంది. మానవుల మధ్య ఈ వైరస్ సోకిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను తాకడం, అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం వల్ల మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం ఉంది. పక్షుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంటి పొర ద్వారా వ్యాపిస్తుంది" అని మనాలి అగర్వాల్ పేర్కొన్నారు.

**'డబ్ల్యూహెచ్‌ఓ సూచనకు అలర్ట్‌గా చూడాలి'**

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపును పరిస్థితికి ప్రతిస్పందనగా కాకుండా, మరో భిన్నమైన ఇన్‌ఫ్లుయెంజా ముప్పు గురించి ఇచ్చిన హెచ్చరికగా చూడాలని ప్రముఖ ఆరోగ్య నిపుణుడు, ఏషియన్ సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తమోరిశ్ కోలే అభిప్రాయపడ్డారు. స్వైన్‌ఫ్లూ అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఒక కాలానుగుణ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ అని తెలిపారు. అయితే బర్డ్‌ఫ్లూ మాత్రం వ్యాధి సోకిన పక్షుల నుంచి, లేదంటే కలుషితమైన పరిసరాల నుంచే మానవులకు వ్యాపిస్తుందని పేర్కొన్నారు. దేశంలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగం, పెంపుడు కోళ్లు, లైవ్ బర్డ్స్ మార్కెట్లు, వలస పక్షుల మార్గాల ఉన్నాయని చెప్పారు.

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన వేదికను శుద్ధీకరణ చేసిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఆ ఘటన నేరమని అన్నారు. ఆ వ్యవహారంపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన ఖర్గే కాంగ్రెస్ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం అనంతరం ఆగస్టు 10వ తేదీన కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆ ఘటనను ప్రస్తావించిన రాహుల్, శుద్ధీకరణ పేరుతో దళితులను అంటరానివారిగా చూపుతున్నారని విమర్శించారు. శుద్ధీకరణ అనేది అంటరానితనానికి మరో పేరు అంటూ అభిప్రాయపడ్డారు. 'దళితులు తాకకూడని వారు, అపవిత్రులు అన్న భావనను ఇది వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అలాంటి చర్యలు నేరం' అని రాహుల్ అన్నారు.

**'బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే'**

అయితే ఆ ఘటనలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వారే ఉన్నారని, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'బీజేపీ ఉత్తరాఖండ్ అధ్యక్షుడే శుద్ధీకరణను సమర్థిస్తున్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ తాను అన్ని కులాలకు చెందిన వ్యక్తినని చెబుతున్నారు. మరి దళిత నాయకుడికి జరిగిన అవమానంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అంటూ ప్రశ్నించారు. ఇక ఆగస్టు 13వ తేదీన రాజ్యసభలో ఆ అంశాన్ని మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనకు పాల్పడిన వారిపై అంటరానితన నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఖర్గే డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడి తరఫున మేం న్యాయం కోరుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఖర్గేకు న్యాయం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు న్యాయం జరిగే చూడాలి' అని రాహుల్ అన్నారు.

**'దళితలను గౌరవించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు'**


ఘటనను కేవలం ఒక రాజకీయ వివాదంగా చూడకూడదని, దేశంలో కుల వివక్షకు సంబంధించిన సమస్యగా చూడాలని రాహుల్ కోరారు. దళితలను గౌరవించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధంగా లేవని ఆరోపించారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం ఇలాంటి వివక్షను నిషేధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళిత పిల్లలను పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, నేలలు ఊడ్చించడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. గ్రామాల్లో సామూహిక బావుల నుంచి దళితులకు నీళ్లు తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. కొన్ని టీ దుకాణాల్లో దళితుల కోసం ప్రత్యేకంగా పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులు, ఇతరుల కోసం గాజు కప్పులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపుగా వెళ్లే సమయంలో దాడులకు గురవుతారనే భయంతో హెల్మెట్ ధరించే పరిస్థితులు కూడా ఉన్నాయని అన్నారు. ఇదే మన దేశ వాస్తవ పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

**'రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'**

దేశంలో ప్రస్తుతం రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నాయకుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఉందని, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస, వివక్ష కొనసాగింది. రాజ్యాంగం దాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాజస్థాన్ కాంగ్రెస్ నేత టికారామ్ జూలీ, కేంద్ర మాజీ మంత్రి జితిన్ రామ్? మాంఝీ వంటి దళిత నేతలు వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని రాహుల్ పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత విజయవంతమైతే, అతడిపై దాడులు అంత తీవ్రంగా ఉంటాయని అన్నారు. అయితే హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ విమర్శలు చేయడాన్ని ఇప్పటికే బీజేపీ ఖండించింది. పార్టీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా గతంలో స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం

జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ డ్రోన్ సంచారం కలకలం రేపింది. ఎల్ఓసీ వెంబడి మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి డ్రోన్ చక్కర్లు కొట్టడాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు సరిహద్దు జిల్లాలను జల్లెడపడుతున్నాయి. డ్రోన్ ఏదైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచిందా? లేదా ఏమైనా తీసుకెళ్లిందా? అనే కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, బాలాకోట్ ప్రాంతంలోని బెహ్రూటి గ్రామం వద్ద రాత్రి 8:05 గంటల ప్రాంతంలో ఓ డ్రోన్ కనిపించింది. కొంతసేపు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టిన డ్రోన్, అనంతరం సరిహద్దుకు సమీపంలోని మంగళ్‌నార్-డబ్రోట్ వైపు కదిలినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తిరిగి పాకిస్థాన్ వైపు వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన బలగాలు నిఘాను మరింత పెంచాయి. తెల్లవారుజామున రంగంలోకి దిగి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని అధికారుల చెప్పారు. డ్రోన్ కదలికలపై నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పదంగా ఏదైనా గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పూంచ్‌తో పాటు జమ్ము ప్రాంతంలోని మరికొన్ని జిల్లాల్లోనూ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉధంపూర్, కథువా, రాజౌరి జిల్లాల పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా బరిలోకి దిగాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఉధంపూర్-కథువా అటవీ బెల్ట్‌లోని కుబాన్, నగేన్, ఖత్రైల్, గోడు ఫలాల్, పదేతర్, చోర్ మొట్టు, కియా, ఖేబా, భేద్, మార్తా, జోఫర్ తదితర మారుమూల గ్రామాలను జల్లెడపడుతున్నాయి.



**ఇద్దరు సాయుధులు**

ఇదే సమయంలో రాజౌరి జిల్లాలోని గైబాస్, మిథియాని, మోగ్లా, నర్లా ప్రాంతాల్లో ఇద్దరు సాయుధులు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో సైన్యం రంగంలోకి దిగింది. బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల గుండా గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అనుమానితులు ఉగ్రవాదులై ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు, సైన్యం, పారామిలిటరీ బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ సాయుధుల గురించి ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ ఏడాది ప్రారంభంలోనూ పాకిస్థాన్?కు చెందిన డ్రోన్లు జమ్ముకశ్మీర్?లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతా దళాలు తిప్పికొట్టాయి. మార్చి 1న జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌కు చెందిన డ్రోన్లు భారత గగనతలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు సరిహద్దుల గుండా చొరబడేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, భారత భద్రతా దళాలు వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాయి. ప్రస్తుతం ఉధంపూర్, కథువా, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో కొనసాగుతున్న తనిఖీలతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా కొంతకాలం క్రితం జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ ద్వారా వాటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానించారు. ఫిబ్రవరి 13న అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం జరిగిన ఈ ఘటనలో కూడా పాకిస్థాన్ డ్రోన్ 'ఏదైనా అనుమానాస్పద వస్తువు విడిచిందా' అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మరో నాలుగు లక్షల కొత్త ఇళ్లు మంజూరు

రాష్ట్రంలోని ఇళ్లు లేని గ్రామీణ పేదలకు కూటమి ప్రభుత్వం త్వరలో శుభవార్త అందించనుంది. రాబోయే వారం లేదా పది రోజుల్లో 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎమ్?ఏవై) గ్రామీణ–2.0' పథకం కింద కేంద్రం రాష్ట్రానికి మరో 4 లక్షల కొత్త ఇళ్లను మంజూరు చేసే అవకాశం ఉంది. రాష్ట్ర అధికారులు ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల వివరాలను కేంద్రానికి సమర్పించారు. దీనిపై కేంద్ర గృహనిర్మాణ శాఖ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. పీఎమ్?ఏవై–2.0 కింద రాష్ట్రానికి ఇప్పటికే 77,000 ఇళ్లు మంజూరయ్యాయి. అదనంగా మరో 4 లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసిన తర్వాత, మొత్తం కేటాయించిన ఇళ్లను జిల్లాల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.



**రాష్ట్ర ప్రభుత్వ చొరవతో**

'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్)–1.0' పథకం కింద రాష్ట్రానికి సుమారు 19 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 2024కు ముందు మంజూరైన 3.71 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని కేంద్రం గుర్తించింది. ఇవి కాకుండా, మరో 4 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించడం వల్ల, చాలా మంది ఇళ్లు నిర్మించుకోవడానికి వెనుకాడుతూ వచ్చారు. లక్షలాది ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో, కొత్త ఇళ్లను మంజూరు చేయడానికి ముందు పాత ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు నిర్ధారించే నివేదిక అవసరమని కేంద్రం పట్టుబట్టింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొత్త ఇళ్ల మంజూరుకు ఈ సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది. ఫలితంగా మొదటి దశలో కేవలం 77,000 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. అయితే రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు సుమారు 9 లక్షల మంది ఉన్నందున, కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని వారికి ఇళ్ల కేటాయింపులు సాధించేందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపింది. దీని ఫలితంగా, కేంద్రం తన వద్ద ఉన్న 25 లక్షల ఇళ్ల 'బఫర్ స్టాక్' (అదనపు నిల్వ) నుంచి 4 లక్షల ఇళ్లను విడుదల చేయడానికి అంగీకరించినట్లు సమాచారం.

**లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు:**

"వైఎస్సార్సీపీ ప్రభుత్వం అస్తవ్యస్త స్థితిలో వదిలేసిన గృహనిర్మాణ లేఅవుట్లను నివాసయోగ్యంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్లలో ఇంకా గృహ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను సేకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్లను ఆయన ఆదేశించారు. 'పీఎం –జన్‌మన్' పథకం కింద ఆదివాసీల కోసం మంజూరైన 43,592 ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు, అలాగే ఈ పనిని పర్యవేక్షించేందుకు తొమ్మిది జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు'

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం


**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతి నిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది.జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ



చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కళ్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొ రేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది.మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.

# అనిల్ లో నిర్వేదం..

**నెల్లూరు :** పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు.మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే



అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది.ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

## బద్వేల్ లో యువతతో పోలీసుల ముఖాముఖి..

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పట్టణంలో యువతతో పరిచయ, అవగాహన కార్యక్రమాన్ని అర్బన్ ఎస్ఐ రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యువతతో ఎస్సై రంగారావు స్నేహపూర్వకంగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక నష్టాలను వివరించారు. చెడు స్నేహాల వల్ల భవిష్యత్తు దెబ్బ తింటుందని, చదువు, ఉద్యోగం, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని యువతకు హితవు పలికారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న అంతర్జాల నేరాలు, నకిలీ సంబంధాలతో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, రహస్య సంకేతాలు, పాస్ వర్డ్ లు చెప్పవద్దని, అనుమానాస్పద లింకులను నొక్కవద్దని సూచించారు. యువత అప్రమత్తంగా ఉండటంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించి, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

## గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు

-మొదటిపేజీ తరువాయి

వచ్చేదన్నారు. ఇప్పుడు మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్?ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వా నిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామ న్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. "ఏ వైద్య పరీక్ష అయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది" అని సీఎం తెలిపారు.

**పారదర్శకంగా 16 వేలమందికి పోస్టులిచ్చాం**

ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా డీఎస్సీ నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారదర్శకంగా 16 వేలమందికి టీచర్ పోస్టులిస్తే ఏడాది తర్వాత గొడ్డలి పార్టీ రాద్దాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడి, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా, ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా శెభాష్ అన్న ముఖ్యమంత్రి. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు? ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. ఆర్.కె.(రామకృష్ణ) నగర్ లో మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. వారందరీ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు

-మొదటిపేజీ తరువాయి

కోటా ఏ–కేటగిరికి రూ. 18,150, బీ–కేటగిరికి (మేనేజ్‌మెంట్ కోటా) రూ.14.52లక్షలు, సీ–కేటగిరి(ఎన్నారై కోటా) రూ.43.56 లక్షల ఫీజులను నిర్ణయించారు. బీడీఎస్ కన్వీనర్ కోటా ఏ–కేటగిరికి రూ.15,730, బీ–కేటగిరికి రూ.4.84లక్షలు, సీ–కేటగిరికి రూ. 14.52 లక్షలుగా నిర్ణయించారు.

**మెడికల్ పీజీ కోర్సులకు**

మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఏ–కేటగిరికి రూ.5,71,320, బీ–కేటగిరికి రూ.11,42,640, సీ–కేటగిరికి రూ.66,12,500 పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమా ఏ–కేటగిరికి రూ.1,78,538, బీ–కేటగిరికి రూ.3,57,075, సీ–కేటగిరికి రూ.19,83,750 ప్రీ క్లినికల్ డిగ్రీ ఏ–కేటగిరికి రూ.80,937, బీ–కేటగిరికి రూ. 1,61,874, సీ–కేటగిరికి రూ.10,58,000గా నిర్ణయించారు. డెంటల్ క్లినికల్ పీజీ డిగ్రీ ఏ–కేటగిరికి రూ. 3,92,783, బీ–కేటగిరికి రూ.7,85,565, సీ–కేటగిరికి రూ.15,87,000 కాగా, పారా క్లినికల్ డెంటల్ పీజీ ఎ–కేటగిరికి రూ.3,53,504, బీ–కేటగిరికి రూ.5,74,759, సీ–కేటగిరికి రూ.9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్, కస్తూరి, నారాయణ, ఎన్నారై, డాక్టర్ సిద్దార్థ మెడికల్ కళాశాలల్లో రూ. 19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులలో తెలిపారు. ఈమేరకు మూడు వేర్వేరు జీవోలను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ విడుదల చేశారు.

**కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదుకు షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇవాళ ప్రకటించిన తుది మెరిట్ జాబితాలో పేరున్న అభ్యర్థులందరూ వెబ్?ఆప్షన్లు ఇవ్వడానికి అర్హులని వెల్లడించింది.

## ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేలా

-మొదటిపేజీ తరువాయి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.92 లక్షల ప్రైజ్ మనీ అందజేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో పతకాలు సాధించిన 264 మంది క్రీడాకారులకు రూ.8.80 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఓర్పు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ఆటలతో భవిష్యత్తు ఉండదనే అపోహను వీడాలని, క్రీడలను చదువుతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో మరింత ప్రాధాన్యం కల్పించేలా క్రీడా కోటా పెంపుపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొస్తామని ప్రకటించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమరావతిలో 500 ఎకరాల్లో అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోందని, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోనూ భారీ క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి పోటీల్లోనూ ఆంధ్రప్రదేశ్ నుంచి క్రీడాకారులు పాల్గొనేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందన్నారు.

# పోలీసు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయాలన్న లక్ష్యంతోనే పోలీసుల పల్లె నిద్ర.

## మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు.

## రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి నరేష్.





**ఆలమూరు ఆగష్టు 29(ప్రజాజ్యోతి):**పోలీసు--ప్రజల మధ్య నమ్మకం, సహకారం పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే నేరరహిత సమాజం సాధ్యమవుతుందని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి నరేష్ అన్నారు. ఆలమూరు మండలం చెముడులంక గ్రామంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు "పల్లెనిద్ర" కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను, అక్కడి పరిస్థితులను గురించి తెలుసుకొని, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో ప్రజల భద్రత, అవగాహన, పోలీసు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, గ్రామాలు, వార్డులలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని, ఆ సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు, నూతన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పూనుకుంటున్నటు వంటి వారి పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విధానాలు, సెల్ఫ్ డిఫెండింగ్ టెక్నిక్స్, సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, ట్రాఫిక్ నియమాలు, సోషల్ మీడియా మోసాలు, యాంటీ డ్రగ్స్, బాల్య వివాహాలు, శక్తి యాప్‌ల డౌన్‌లోడ్‌ల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు భాష వైభవాన్ని కాపాడుకుందాం

## - రాజుపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.బాల ఓబన్న పిలుపు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 29 (ప్రజాజ్యోతి)** తెలుగు భాషా వైభవాన్ని, విశిష్టతను కాపాడుకుందామని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.బాల ఓబన్న పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బద్వేలు మండల పరిధిలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎన్.బాల ఓబన్న మాట్లాడుతూ వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని, మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ప్రపంచ భాషలలోనే అత్యంత గొప్ప భాష, మధురమైన భాష తెలుగు భాష అని పేర్కొన్నారు. తెలుగు భాషలో ఉన్న నుడికారాలు, సామెతలు, శబ్దపల్లవాలు, అవధాన ప్రక్రియ, అలంకారాలు, చంధో ప్రక్రియ, మరే భాషలో లేవన్నారు. ప్రపంచవ్యాప్తంగా 6600 భాషలు ఉండగా తెలుగు భాష 16వ స్థానాన్ని ఆక్రమించడం గొప్ప విషయమ న్నారు. ఐదేళ్ళ క్రితం తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించిందని పేర్కొన్నారు. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని కీర్తించబడిందంటే తెలుగు భాష ప్రశస్థి ఏ పాటిదో గుర్తించవచ్చున్నారు. అలాంటి భాష నేడు నిరాధారణకు గురి అవుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నదని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తిని ప్రదర్శించాలన్నారు. కృషి ఉంటే క్రీడలలో రాణించవచ్చని, ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయులు మాదన విజయ కుమార్ మాట్లాడుతూ గ్రాంథిక భాషగా ఉన్న తెలుగును వ్యవహారిక భాషలోకి మార్చడానికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. తెలుగు భాషా వికాసానికి గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. రాయప్రోలు, త్రిపురనేని, చిలకమర్తి, పానుగంటి, శ్రీశ్రీ, కాళోజి, సినారె లాంటి మహాకవులు తెలుగు సాహిత్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారని కొనియాడారు. ఈనాడు భారతదేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని, ప్రపంచ భాషలలో మాండరిన్ తర్వాత తెలుగు రెండో స్థానంలో ఉన్నదని, అయితే ఆధునిక పరిణామ మార్పులు నేపథ్యంలో తెలుగు భాష విపరీతంగా నిరాధారణకు గురవుతున్న భాషల్లో తెలుగు కూడా ముందంజలో ఉండటం బాధాకరమన్నారు. విదేశీయుడైనప్పటికీ ఉద్యోగ శిక్షణలో భాగంగా తెలుగు నేర్చుకున్న సిపి బ్రౌన్ భాషపై మమకారం పెంచుకొని తాళపత్రాలు సేకరించి మిణుగు మిణుగు మంటున్న తెలుగు దీపాన్ని వెలిగించాడన్నారు. భాష కేవలం భావ వ్యక్తీకరణకు మాత్రమే కాదని మానవ సంబంధాలను అభివృద్ధిపరిచే సాంస్కృతిక ప్రతిబింబని ఆయన పేర్కొన్నారు. తెలుగు భాష వికాసానికి, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని ఆయన కోరారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.ఆంథోనీ రావు, పట్టెం వెంకటసుబ్బారెడ్డి, బి.థామస్, టి.దస్తగిరి, ఎ.రాజేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవం



**గుంతకల్లు ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యం లో శనివారం తెలుగు భాషా దినోత్సవం ( గిడుగు వెంకట రామమూర్తి జయంతి) వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఏ.లక్ష్మయ్య హాజరై భాష ద్వారానే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందుతాయ ని గిడుగు గ్రాంథిక భాషలో ఉన్న తెలుగును వ్యవహారిక భాషలోకి తీసుకురావడానికి కృషి చేశారని, అంతేకాకుం డా తెలుగు భాష పురాతన మైనది తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదించిన ఎందరో మహానుభావులు దేశభాషలందు తెలుగు లెస్స అని కొనియాడిన ఘనత అమ్మ భాషని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వపు పోటీ మరియు పద్యపఠన పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల అధ్యక్షులు చేతుల మీద బహుమతులు ప్రధానం చేశారు. అలాగే పావని అనే విద్యార్థిని తెలుగు తల్లి వేషధారణలో సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమం లో తెలుగు విభాగ అధిపతి ఎం.పరమేష్, తెలుగు అధ్యాపకురాలు వనజమ్మ, కళాశాల ఉపాధ్యక్షులు ఏ. రవిశంకర్ శర్మ, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ కె.హనుమంత రెడ్డి, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి. పవన్ ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

# ప్లాటినం జూబ్లీకి బాపట్ల మున్సిపాలిటీ సిద్ధం



**బాపట్ల ఆగస్టు 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**చారిత్రక నేపథ్యం కలిగిన బాపట్ల పట్టణం మరో ప్రత్యేక ఘట్టానికి సిద్ధమవుతోంది. ఆంధ్రోద్యమానికి పురిటిగడ్డగా, తెలుగు జాతి చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన బాపట్ల పురపాలక సంఘం 75 పూర్తి చేసుకున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పురపాలక సంఘం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు బాపట్ల పట్టణం అనేక మార్పులకు సాక్షిగా నిలిచింది. ఈ చారిత్రక ప్రస్థానాన్ని గుర్తుచేసేలా ప్లాటినం జూబ్లీ ఉత్సవాల కోసం రూపొందించిన ప్రత్యేక లోగోను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపట్ల మున్సిపాలిటీ ప్లాటినం జూబ్లీ వేడుకలను త్వరలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. పట్టణ చారిత్రక ప్రాధాన్యతను కాపాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. బాపట్లను స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు బాపట్ల చరిత్రను భావితరాలకు అందించేందుకు ఫోరం ఫర్ బెటర్ బాపట్ల చేస్తున్న కృషిని కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు వివరించారు. పట్టణ తొలి మున్సిపల్ చైర్మన్ వెలగపూడి సుబ్బా రావు సేవలకు గుర్తుగా చంద్రకళా పార్కులో ఆయన విగ్రహాన్ని ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన ఏర్పాటు చేసిన విజయ స్థూపాన్ని కూడా పునరుద్ధరించినట్లు చెప్పారు. ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా బాపట్ల పురపాలక సంఘం గత ప్రస్థానాన్ని గుర్తుచేసుకోవడంతో పాటు భవిష్యత్ అభివృద్ధికి కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు జీవి, కార్యకర్తలు గొల్లపల్లి శ్రీనివాసరావు, చివుకుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ ఆగస్టు 29 (ప్రజాజ్యోతి)**భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 16వ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 1,2,3 వ తేదిలలో నెల్లూరు లో ఘనంగా జరగబోతున్నాయని యువత పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్.కె ఆదిల్ తెలిపారు. ఈ సందర్భంగ ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ మాట్లాడుతూ యువజనుల పోరాటాల వారధి ఉద్యమాల సారధి డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 1 2 3 తేదీలలో నెల్లూరు లో జరుగుతున్నాయని అన్నారు. మహాసభలలో రాష్ట్రంలో నిరుద్యోగ యువత సమస్యల పై చర్చిస్తామని అన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పననే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.అందరికీ విద్య ఉపాధి కోసం పోరాడుతున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసారు అన్నారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని అన్నారు.స్థానిక పరిశ్రమలో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేసారు.భూ నిర్వాసిత యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు.కడప ఉక్కు కు నిధులు విడుదల చేసి పరిశ్రమ త్వరగా పూర్తి కోసం చర్యలు చేపట్టాలని కోరారు.ఈ డిమాండ్లు అన్ని రాష్ట్ర మహాసభలలో చర్చించి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి ఎస్.కె షబ్బీర్ పట్టణ సహాయ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు

## గోపవరం వ్యవసాయ పొలాల్లో రైతుల బోర్ల వై యర్లు చోరీ

### వ్యవసాయ పొలాలకు సాగునీరు అందక రైతుల ఇబ్బందులు





**చెన్నూరు, ఆగస్టు, 29,** చెన్నూరు మండలం శివాల పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోపవరం గ్రామం పరిధిలో రైతులు సాగునీటి కోసం భూమిలో బోర్లు వేగా శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోపవరం గ్రామానికి చెందిన కే సుబ్బరాయుడు యాదవ్ కు చెందిన రెండు వ్యవసాయ బోర్లకు సంబంధించి 15 మీటర్లు వరకు డబల్ వైర్లు కత్తిరించుకొని వెళ్లారు, శనివారం ఉదయం 6 గంటలకు విద్యుత్ వస్తుందన్న ఆశతో ఇంటి నుంచి బోర్ల దగ్గరికి వెళ్లిన రైతులకు వైర్లు కనిపించకపోవడంతో రైతులు కు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోయారు, గోపవరం గ్రామానికి చెందిన పాడి రైతులు వ్యవసాయ పొలాల్లో గడ్డి సాగు చేసుకుంటూ పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు, గుర్తు తెలియని దొంగలు ఓయర్లు చోరీ చేయడంతో రైతుల పరిస్థితి మునిగేనక్కపై తాటికాయపడినట్టు తయారైంది, ప్రస్తుతం కేసీ కెనాల్ కు నీరు అందక వర్షాలు పడకపోవడం బోర్ల ద్వారానైనా పశువులకు గడ్డి సాగు చేసుకుందామన్న ఆశతో బోర్లు ఏర్పాటు చేసుకోగా సాగునీటి బోర్ల వైర్లను దొంగలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మోటార్ల వయర్లు చోరీ గురి కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు,

## కూడేరు కేజీబీవీ విద్యార్థినుల కోసం ప్రత్యేక నీట్ ఎంసెట్ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలి

### -నారాయణపురం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కుమ్మతి హనుమంత్ రెడ్డి



**ఆగస్టు 29 ప్రజ జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-**కూడేరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల్లో అనేకమంది ప్రతిభావంతులై, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించే సామర్థ్యం కలిగి ఉన్నారు. అయితే నీట్ ఎంసెట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ మరియు మార్గదర్శకత్వం అందుబాటులో లేకపోవడం వల్ల, వారి ప్రతిభకు తగిన ఉన్నత విద్యా అవకాశాలు దూరమవుతున్నాయి.పోటీ పరీక్షల్లో ఆశించిన ర్యాంకులు సాధించలేకపోతే ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు చెల్లించాల్సి రావడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థినులు ఉన్నత విద్యను కొనసాగించలేక చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోంది. తద్వారా కొంతమంది తల్లిదండ్రులు బాలికల ఉన్నత విద్య కంటే వివాహం వైపు మొగ్గుచూపే పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశం ఉంది.అందువల్ల కూడేరు కేజీబీవీ లో ఒక సంవత్సరం పిల్లట్ ప్రాజెక్ట్ గా ప్రత్యేక నీట్ ఎంసెట్ అకాడమీ ప్రోగ్రాం ను ఏర్పాటు చేసి, ఫిజిక్స్ కెమిస్ట్రీ బోటనీ జువాలజీ తో పాటు నీట్ ప్రత్యేక కోచింగ్, బాక్ స్టడీ మెటీరియల్స్ క్యూస్షన్ బ్యాంక్స్ మరియు ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఇంటెన్సీ ట్రైనింగ్ అందించవలసిందిగా వినమ్రంగా కోరుతున్నాము.ప్రతిభ ఉన్న ప్రతి బాలికకు ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ఉన్నత విద్యలో ముందుకు సాగే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యంగా ఉండాలి.కావున, కూడేరు కేజీబీవీ విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని మంజూరు చేసి, తగిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరుచున్నాము అని కూడేరు మండలం పి నారాయణపురం మాజీ గ్రామ సర్పంచ్ కుమ్మతి హనుమంత్ రెడ్డి తెలియజేశారు.

## వివేకానంద ఆంగ్లమధ్యమ పాఠశాలలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



**గుంతకల్లు ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** తెలుగు భాష ఉన్నతికి అవిరల కృషి చేయడం లో పాటుగా తెలుగుజాతి గొప్పదనాన్ని ఖండంతరాలకు చాటి చెప్పిన బహుభాషా కోవిధుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి పురస్కరించుకొని శనివారం గుంతకల్లు పట్టణం లోని ఉరవకొండ లో గల వివేకానంద ఆంగ్లమ ధ్యమ పాఠశాలలో తెలుగు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మంజునాథ్, కరెస్పాండంట్ ఓంకారప్ప, గురు రాజు, ప్రధానోపాధ్యా యులు నాగమణి, సి ఈ ఓ శ్రీనివాసులు, ప్రైమరి ఇంచార్జ్ సరోజమ్మ,లత మరియు అధ్యాపక బృందం అయినా కళ్యాణ్, ప్రశాంత్, అశ్విని,రవి,సుమిత్,కవిత,లింగ, ఆశ,అనురాధ పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "పాలమీగడ కన్నా, చెరుకు రసం కన్నా, మధురమైన తెలుగుభాష" తెలుగు భాషలందు తెలుగు లెస్స " అని శ్రీ కృష్ణ దేవరాయులు ప్రవచిస్తే." ఇటలీయాన్ అఫ్ థి ఈస్ట్ గా " నికొలిడి కాంటి పేర్కొన్నారు. విద్యార్థుల్ని ల తెలుగు తల్లి వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత మంజునాథ్ రెడ్డి



**గుంతకల్లు ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలంలోని అయ్యవారి పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమార్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి గుంతకల్లు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత మంజునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుమార్ కుటుంబ సభ్యు లకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజే స్తూ, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అయ్యవారి పల్లి గ్రామ మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు హనుమంత రెడ్డి, జయరామిరెడ్డి, మేఘనాథ్ రెడ్డితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంబందిత అధికారులు రోడ్డుపై పడిఉన్న చెట్టును తొలిగించండి!..



**వి.ఆర్.పురం ,ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఆర్ బి, అధికారులు కొద్దిగా గమనించండి. వరరామచంద్రాపురం నుండి జీడిగుప్ప, వెళ్లే ప్రధాన రహదారిలో మొద్దుల గూడెం,రోడ్డు" అప్" పరిధిలో చెట్టు రోడ్డు పై గత 15 రోజులుగాపడి ఉంది. ఈ దారిపై వాహన రాకపోకలు భారీగానే తిరుగుతుంటాయి.దీని వలన రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగేఅవకాశం ఉంది. సంబంధిత శాఖ అధికారులు చెట్టునుతొలగించ వలచిందిగా వాహనదారులు కోరుతు న్నారు. ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## నాయుడు స్కూల్ బూత్‌లో ఓటర్ల సవరణకు విశేష స్పందన





**బాపట్ల ఆగస్టు 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పట్టణంలోని సీఎస్ఎస్ నాయుడు స్కూల్ పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి ఓటర్ల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 320 మంది ఓటర్లు తమ వివరాల్లో మార్పులు, సవరణలతో పాటు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులు సమర్పించారు. మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్, డీఈ కృష్ణారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ల వివరాలను బూత్ స్థాయి అధికారులు పరిశీలించి, అవసరమైన సవరణలు చేసేందుకు సహకరించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన దరఖాస్తులను కూడా స్వీకరించారు.కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ ఎ. శామ్యూల్ జాన్, బీఎల్‌ఓలు నిమ్మకాయ ల గోపి, శ్రీలక్ష్మి, పద్మ, ఎస్.కె. నజీరా, ఎస్. రోజనే, ఎం. సుకన్య పాల్గొన్నారు.

# తెలుగు వెలగాలి - తెలుగు భాష వర్ధిల్లాలి









**చాగలమర్రి , ఆగస్టు 29( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రి మండలంలో అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాల నందు ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల ఆధ్వర్యంలో తెలుగు భాష కోసం కృషి చేసిన వ్యక్తి గిడుగు వెంకట రామమూర్తి మరియు క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ గారి చిత్ర పటాలకు పూల మాలలతో నివాళులర్పించడం జరిగింది. 1966 అధికార భాషా చట్టం ద్వారా తెలుగును రాష్ట్ర అధికార భాషగా ప్రకటించడం జరిగిందని ప్రతి ఏడాది ఆగస్ట్ 29న ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో ఈ తేదీని తెలుగు కవి వెంకట రామమూర్తి జన్మ దినోత్సవంగా మార్చడం జరిగింది. తెలుగు భాష అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయులను నేడు తలుచుకోవడం ద్వారా అమ్మ భాషకు సేవ చేసిన తెలుగు పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. "గిడుగు" అనే అక్షర ఆకృతిలో విద్యార్థులు తమ ఆసక్తిని ప్రద ర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ అన్సర్ బాషా మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, మాతృభాష తెలుగు మన జీవితాలకు వెలు గునిస్తుంది అన్నారు. తెలుగు భాష పరిరక్షణకు, సుసంపన్నం చేసుకోవడానికి తెలుగు ప్రజలందరూ సిద్ధం ఉండాలని భావి తరాలకు తెలుగు మార్గదర్శకం కావాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు నినాదాలను మరియు కవుల చిత్రపటాలను ప్రదర్శించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయుడు ముల్లా షబ్బీర్ అహ్మద్ ఇతర ఉపా ధ్యాయులు విద్యార్థిని విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు గమనిస్తున్నారు!.. కూటమి ప్రభుత్వానికి పతనంతప్పదు!..

**సమిష్టిగా వెళదాం!..**

**సత్తా చాటుదాం!..**

**వై.కా.పా మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు!..**



**వి.ఆర్.పురం, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** ప్రజలు గమనిస్తున్నారని, పతనం తప్పదని, కొత్త పెన్షన్లు లేవు, నిరుద్యో గభృతిలేదు, మహిళలకు ఇస్తామన్న 1500/-వందల రూపాయల ఏమయ్యాయని, ఏముఖం పెట్టుకోని స్థానిక ఎన్నికల్లో ఓట్లు ఏలా అడుగుతారని, వై.కా.పా, మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, ప్రశ్నించారు. శనివారం రంపచోడవరం నియోజకవర్గ, మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాగులపల్లి ధనలక్ష్మి, ఆదేశానుసారం రేఖపల్లి గ్రామంలో మాజీ మండల కన్వీనర్ సీనియర్ నాయకులు పోడియం గోపాల్, అధ్యక్షతన వైస్సార్సీపీ మండల కమిటీ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు,మాజీ సర్పంచ్ పిట్టా రామారావు, సీనియర్ మాచర్ల గంగయ్య, మాట్లాడుతూ, స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, వైఎస్ ఆర్సిపీ, బలపరిచిన అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలుపొంది ఎం.పీ.పీ, జడ్పీ.టీ.సీ,లను కైవసం చేసుకునే దిశగా కార్యకర్తలు అందరు సమిష్టిగా పని చేయాలని, పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. నేటికీ ఒక్కకొత్త రేషన్ కార్డు, కొత్త పెన్షన్లు, ఇవ్వలేదని, నిరుద్యోగ భృతిలేదని, మహిళలకు ఇస్తానన్న 1500/-హామీలగానే మిగిలాయితప్ప కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. ఫ్రీ గ్యాస్ లేదని,50 ఏళ్లకే పెన్షన్ అన్నారు కానీ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.ఈప్రాంత పోలవరం నిర్వా సితుల పట్ల ఈ మండలంలో కొంతమంది పాలక పక్ష నాయకులు వ్యవహరిస్తున్న విధానాలపట్ల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని, ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు.రానున్న స్థానిక సార్వత్రికఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, అధికార ప్రతినిది మండల నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ హోదాల్లో ఉన్ననాయకులు కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం

## క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కారంపై ఎలక్టోరల్ అబ్జర్వర్ కన్నబాబు సమీక్ష



**బాపట్ల ఆగస్టు 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల ను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్, పౌర సరఫరాల కమిషనర్ కె. కన్నబాబు సూచించారు. శనివారం బాపట్ల కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ వి. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ, నోటీసుల జారీ, హియరింగ్‌ల పురోగతిపై వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 9,40,389 మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ కేంద్రాల సంఖ్యను 1,367కు పెంచినట్లు తెలిపారు. నోటీసుల పంపిణీ పూర్తయిందని, ఇప్పటివరకు 58,065 హియరింగ్‌లు పూర్తయ్యాయని వివరించారు. కన్న బాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 28 నాటికి క్లెయిమ్‌లు, అభ్యం తరాల పరిష్కారం పూర్తి చేసి అక్టోబర్ 3 నాటికి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గం, పోలింగ్ కేంద్రానికి బీఎల్ఏలను నియమించుకోవాలని రాజకీయ పార్టీలకు సూచించారు. నో మ్యాపింగ్‌కు సంబంధిం చిన నోటీసులపై ఆధార పత్రాలను స్వీకరించి విచారణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అనంతరం చీరాల, బాపట్ల ప్రాంతా ల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను విని, అవసర మైన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించారు.కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు హరికుమార్, నరసింహారావు, శ్రీదేవి, పరిపాలనాధి కారి మల్లికార్జునరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ షఫీ, జనసేన, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మాధవి, మాల్యాద్రి, బాలనారాయణ, గంగయ్య, రాజారాం, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక దృఢత్వం

**- యువత ఉన్నతమైన భవిష్యత్ కు క్రీడారంగం ఉత్తమమైనది**

**- యువత క్రీడల్లో రాణించేందుకు మౌలిక వసతులు అవసరం**

**- లోలుగు గ్రామంలో సొంత నిధులతో వాలీబాల్ మైదానం అభివృద్ధి చేస్తున్న జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో ప్రతిభను చాటుకోవాలంటే మౌలిక సదుపాయాలు ఎంతో అవసరమని జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్ అన్నారు. ఈ మేరకు పొందూరు మండలం లోలుగు గ్రామ యువత, ముఖ్యంగా వాలీబాల్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు తన సొంత నిధులతో జేసీబీ ఏర్పాటు చేసి మైదానాన్ని చదును చేయిస్తున్నారు. వాలీబాల్ పిచ్‌ను కూడా క్రీడాకారులకు అనుకూలంగా సిద్ధం చేయిస్తున్నారు.ఈ సందర్భంగా లోలుగు వెంకట్ మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నేటి యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా మైదానాల్లోకి వచ్చి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.యువత ఆరోగ్యంగా, ఉత్సాహం గా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం, బలమైన దేశం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.గ్రామంలో క్రీడలకు మరింత ప్రాధాన్యత కల్పించడంతో పాటు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వెంకట్ తెలిపారు.వాలీబాల్‌తో పాటు ఇతర క్రీడల్లోనూ యువత ముందుకు రావాలని, క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ యువత కోసం వెంకట్ చేస్తున్న సేవా కార్యక్రమం ఇదే మొదటిసారి కాదని, గతంలోనూ అనేక సందర్భాల్లో యువతకు అండగా నిలిచారని కొనియాడారు. సొంత నిధులతో మైదానాన్ని అభివృద్ధి చేసి వాలీబాల్ పిచ్‌ను సిద్ధం చేయించడం అభినందనీయమని అన్నారు. గ్రామ యువత క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఆయన సహకారం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

## క్రీడలతోనే మానసిక, శారీరక వికాసం ఎమ్మెల్యే కూనంనేని

## ఉత్సాహంగా సాగిన 2కే రన్ పతక విజేతలు, కోచ్‌లకు ఘన సన్మానం

**ఎటపాక, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):**మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన ఽ క్రీడల శాఖ (డీవైఎస్‌వో) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 2కే రన్ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణం వద్ద ఎమ్మెల్యే కూనంనేని జెండా ఊపి ఈ రన్‌ను ప్రారంభించగా, ప్రకాశం స్టేడియం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే కొత్తగూడెంలో 19 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక స్టేడియం నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. 2025-26 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన ఘనంగా అభినందించారు. అనంతరం ప్రకాశం స్టేడియంలో కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ (డీఎస్‌వో) పరంధామ రెడ్డి మాట్లాడుతూ, సరైన వసతులు లేని రోజుల్లోనే మేజర్ ధ్యాన్‌చంద్ వెన్నెల వెలుగుల్లో సాధన చేసి దేశానికి మూడుసార్లు ఒలింపిక్ స్వర్ణాలు అందించారని గుర్తుచేశారు. ఆ నిరంతర సాధన వల్లే ఆయన



జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు - కొత్తగూడెం

పేరులో 'చాంద్' భాగమైందని పేర్కొంటూ, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోనే తొలి హార్ట్ బైపాస్ సర్జరీ సర్వైవర్, పవర్ లిఫ్టింగ్ నేషనల్ ఛాంపియన్ డి.వి. శంకరరావు మాట్లాడుతూ, నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తని, ప్రతి ఒక్కరూ వ్యాయామం, క్రీడలను దినచర్యగా మార్చుకోవాలన్నారు. విజేతలకు ఘనంగా సత్కారం వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు. వారిని తీర్చిదిద్దిన కోచ్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. భద్రాచలం ప్రాంతానికి చెందిన పవర్ లిఫ్టింగ్ సీనియర్ మాస్టర్స్ డి.వి. శంకర్ రావు, మహంతి వెంకటకృష్ణాజి, పవర్ లిఫ్టింగ్ కోచ్ గొంగడి రామిరెడ్డిలను మేయర్ మూడ్ గణేష్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ జి.వి. రామిరెడ్డి, ప్రముఖులు ఇందిరాల శ్రీధర్, మహీధర్, కాశీ హుస్సేన్, రమేష్‌తో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మర్రిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వ్యవహారిక భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు





**కూనవరం ఆగస్టు 29. ప్రజా జ్యోతి** ఆగస్టు 29 న గిడుగు వెంకట రామ మూర్తి జయంతి ని పురస్కరించుకొని వ్యవహారిక భాష దినోత్సవం మరియు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భం గా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకోవడం పరిపాటి. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్రిగూడెంలో ఈ కార్యక్రమాలను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు సోడే వెంకట్రావ్ తెలిపారు. తెలుగు టీచర్ సీత , వ్యాయామ ఉపాధ్యాయులు కామేశ్వర్ రావు విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు, క్విజ్, వ్యాసరచన, కథలు, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్రీడల ఆవశ్యకత, వ్యవహారిక భాష ప్రాధాన్యతను తెలుపుతూ గిడుగు వెంకట రామ మూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వక్తలు నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు అనిల్ కుమార్, భవాని, కాశేశ్వరరావు, రాజులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కోలాటం కళ దేశ సంస్కృతి , సాంప్రదాయాలకు ప్రతీక

- కోలాటం కళను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి
- పల్లెల నుండి మరింత మంది కళాకారులు వెలుగులోకి రావాలి
- గ్రామీణ కళాకారులకు అండగా నిలవాలి
- శ్రీకాకుళం జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు





**రణస్థలం , ప్రజాజ్యోతి న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసి, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు పిన్నింటి వెంకటి భానోజీనాయుడు అన్నారు. బండిపాలెం గ్రామంలోని శ్రీ శ్రీ నీలమ్మ తల్లి కోలాటం గ్రూప్ కళాకారులకు గ్రూప్ యూనిఫామ్‌లో భాగంగా చీరలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భానోజీనాయుడు మాట్లాడుతూ మన పల్లెల్లో ఎన్నో కళలు, ఎంతో ప్రతిభ దాగి ఉన్నాయన్నారు.ముఖ్యంగా కోలాటం వంటి సంప్రదాయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛమైన పల్లె వాతావరణం నుంచి మరింత మంది కళాకారులు వెలుగులోకి రావాలన్నారు.కళాకారులకు అవసరమైన సహకారం అందిస్తూ వారిని ప్రోత్సహిస్తే మన గ్రామీణ కళలు మరింత అభివృద్ధి చెందుతాయని భానోజీ నాయుడు పేర్కొన్నారు.కోలాటం కళ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, యువత కూడా ఇటువంటి జానపద కళలపై ఆసక్తి పెంచుకోవాలని ఆయన సూచించారు. కళాకారులకు యూనిఫామ్ చీరలు అందించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా కళాకారులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గొర్లెహరిబాబు, కరిమజ్జి అప్పలనాయుడు, పచ్చిపాల పెంటయ్య, ఎండ తవుడు, పచ్చిపాల పండు, గుడ్డి భవాని, ఎండ ప్రసాద్, శ్రీశ్రీ నీలమ్మ తల్లి కోలాటం గ్రూపు మాస్టర్ ఎండ బంగారమ్మ, గుడి అనితతో పాటు బండిపాలెం గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

# మహనీయులను మరవొద్దు!

తెలుగుభాషా పితామహుడు గిడుగు!..
హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్!..
ప్రధానోపాధ్యాయులు పుల్లగుమ్మి మురళీమనోహర్ రావు!..




**వి.ఆర్.పురం,ఆగస్టు29 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** మహనీయులను మరవొద్దని ప్రధానోపాధ్యాయులు పుల్లగుమ్మి మురళీ మనోహర్ రావు, స్పష్టం చేశారు.శనివారం వరరామచంద్రాపురం మండలం సోముల గూడెం,ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో, జాతీయ క్రీడాదినోత్సవం మరియు తెలుగుభాషా దినోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. "హాకీ" మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ మరియు తెలుగు భాషా పితామహుడు గిడుగురామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు పుల్లగుమ్మి మురళి మనోహర్ రావు,అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులను మరవొద్దని,వారి జ్ఞాపకాలను నెమరవేస్తూ క్రీడానైపుణ్యం, విద్యాబుద్ధులు కలిగి ఉన్నత స్థాయిలో విద్యార్థినీలు నిలవాలని కోరారు.ఈరోజుమనం ఏదైతే సాధించామని "టార్గెట్" పెట్టుకున్నామో ఆదిశగా విద్యార్థినీలు ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**క్రీడా దినోత్సవంలో భాగంగా:**

విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందేలు నిర్వహించారు.క్రీడలవల్ల క్రమశిక్షణ, ఆరోగ్యం, జట్టు స్ఫూర్తి పెరుగుతాయనిపాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి మనోహర్ రావు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఆదేవిధముగా ఈ పాఠశాల నుండి జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో మూడు సార్లుపాల్గొని మడకం సురేఖ, రజితం పతకం, బంధం సరిత రెండు సార్లు పాల్గొని కాంస్యం పతకాని మరియు వీరబోయిన శ్రావణి ఒక్కసారి పాల్గొనడం జరిగింది.వీరికి పాఠశాల బృందం ప్రత్యేక అభినందిస్తూవారిని సన్మానించడం జరిగింది.

**తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా:**

తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థుల చేపద్య పఠనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తెలుగును మాతృభాషగా గౌరవించాలని, మాట్లాడాలని, చదవాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై సలీమా ప్రత్యేక దృష్టి

**ములపాలెంలో ఓటర్ల జాబితాపై 144 నోటీసుల విచారణ**



**బాపట్ల ఆగస్టు 29 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ములపాలెం గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 144 నోటీసులకు సంబంధించి విచారణ చేపట్టారు. తహసీల్దార్ షేక్ సలీమా పర్యవేక్షణలో పోలింగ్ స్టేషన్ల వారీగా విచారణ ప్రక్రియ కొనసాగింది. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలతో పాటు సంబంధిత ఆధార పత్రాలను అధికారులకు అందజేశారు. సమర్పించిన పత్రాలను అధికారులు పరిశీలించి ఎన్నికల రికార్డుల్లోని వివరాలతో సరిపోల్చుతున్నారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, మ్యాపింగ్‌కు సంబంధించిన సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## గజ్జహళ్లిలో ఘనంగా ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు


**మూడవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో అభిషేకాలు.. లంకబిండె ఊరేగింపు**





**హొళగుంద, ఆగస్టు 29, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో మూడవ శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కేరే అనుమప్ప వద్ద దర్శనమిస్తున్న శ్రీ ఆంజనేయస్వామికి భక్తులు అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపట్టారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారి లంకబిండెను భక్తులు భక్తిశ్రద్ధలతో గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజ యధ్వానాల నడుమ లంకబిండెను ఆలయానికి చేర్చి, పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు.మూడవ శ్రావణ శనివారం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులంతా ఆంజనేయస్వామి ఆశీస్సులు పొంది కార్యక్రమాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు.

## గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న మక్కా సాయిబాబు నాయుడు



**జి సిగడాం , ప్రజాజ్యోతి న్యూస్:** జి సిగడం మండలం పెనసాం గ్రామం టిడిపి సీనియర్ నాయకులు కుదరెల్ల అప్పారావు ఆహ్వానం మేరకు వారి గృహప్రవేశం వేడుకలలో జనసేన పార్టీ నాయకులు,తూర్పు కాపు రాష్ట్ర అధ్యక్షులు మక్కా సాయిబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అప్పారావు కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి నమస్కరించి ప్రసాదం వారి స్వీకరించి కుటుంబసభ్యులకు శు భాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పొగిరి అప్పలనాయుడు , సాలాబత్తుల పైడిరాజు , వద్దాది శ్రీనివాసరావు , పాకల కిషోర్, బలరాం, కొప్పు సింహాచలం , సబ్బి రాము ,తూర్పు కాపు పెద్దలు బాలి రమేష్ నాయుడు ,గవర జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఉరివేసుకొని యువకుడు మృతి



**చింతూరు ఆగస్టు 29 (ప్రజాజ్యోతి** పోలవరం జిల్లా చింతూరు ఏజెన్సీలో వివాహేతర సంబంధం వ్యక్తి ఆత్మ హత్యకు దారితీ సింది. చింతూరు మండలం చట్టి గ్రామా నికి చెందిన సోడే రాజ్ కుమార్ గత రాత్రి సుమారు 10 గంటల సమయంలో శబరి వంతెన సమీపంలో ఉన్న విద్యుత్ హెవీ లైన్ టవర్ కు ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్ప డ్డాడు. రాజ్ కుమార్ కు పెళ్ళయి ముగ్గురు సంతాన ఉన్నారు. ఇతడు మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే ఈ విషయమై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. గత రాత్రి రాజ్ కుమార్ తన వివాహేతర సంబంధ మహిళను తన ఇంట్లో భార్య తో కలిసి జీవించేందుకు ఒప్పించే క్రమంలో ముదిరిన వివాదంతో రాజ్ కుమార్ మనస్తాపానికి గురై రాత్రి 10 గంటల సమయంలో ఇంటి నుండి వెళ్లిపోయి ఉదయం ఉరివేసుకుని కనిపించినట్లు తెలిపారు.చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కార్యకర్తలకు దిశానిర్దేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రతిభకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

- టీడీపీ శిక్షణా తరగతుల్లో సమర్థవంతమైన బోధన
- ప్రశంసా పత్రంతో అభినందించిన ముఖ్యమంత్రి





**మంగళగిరి ప్రజాజ్యోతి న్యూస్ :**మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన నాయకులు, కార్యకర్తల శిక్షణా తరగతులు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేలా సాగాయి. ఈ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు బోధకులుగా పాల్గొని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, కార్యకర్తల బాధ్యతలపై అవగాహన కల్పించారు.ఈ శిక్షణా తరగతుల్లో బోధకుడిగా పాల్గొన్న ఆమదాలవలస ఎమ్మెల్యే ,రాష్ట్ర పి.యూ. సి చైర్మెన్ కూన రవికుమార్ పార్టీ క్రమశిక్షణ, రాజకీయ పరిస్థితులు, కార్యకర్తల పాత్ర తదితర అంశాలను సమర్థవంతంగా వివరించారు. తన అనుభవాలను కార్యకర్తలతో పంచుకుంటూ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు.శిక్షణా తరగతుల్లో బోధకులుగా సేవలందించిన ఎమ్మెల్యేలు, మంత్రులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ ప్రతిభను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యకర్తలకు విషయాలను సులభంగా అర్థమయ్యేలా వివరించడంలో ఆయన చూపిన చొరవను అభినందించారు.అనంతరం ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు.కార్యకర్తలకు శిక్షణ, పార్టీ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో కూన రవికుమార్ చూపిన ప్రతిభకు ముఖ్యమంత్రి స్థాయిలో ప్రశంసలు లభించడం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు





**హొళగుంద, ఆగస్టు 29, ప్రజా జ్యోతి న్యూస్ –** హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని, ప్రముఖ హాకీ క్రీడాకారుడు, ఒలింపిక్స్‌లో మూడుసార్లు పతకాలు సాధించిన ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించి, పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు తమ మాతృభాషలో మాట్లాడటంతో పాటు తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగు భాష ప్రాధాన్యత, గిడుగు వెంకట రామమూర్తి సేవలు, క్రీడల ప్రాముఖ్యతపై ప్రసంగాలు చేశారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలవరం కాలువలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యం: గొల్లప్రోలు పోలీసుల దర్యాప్తు!





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** కొడవలి గ్రామం శివారులో తీవ్ర కలకలం రేగింది. పోలవరం కాలువలో ఓ గుర్తుతెలియని పురుషుడి శవం కొట్టుకొచ్చి స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. శవం సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా పోలీసులు అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే...కొడవలి గ్రామం శివారులో ఉన్న ఇందిసమ్మ గుడి సమీపంలోని పోలవరం కాలువ నీటిలో ఓ వ్యక్తి శవం బోర్లపడి ఉండటాన్ని శనివారం స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని వెంటనే కొడవలి గ్రామ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ పి. పద్మశేఖర్ చేరవేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వీఆర్వో పరిస్థితిని సమీక్షించి, వెంటనే గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. వీఆర్వో పద్మశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుపై గొల్లప్రోలు పోలీసులు తక్షణమే స్పందించి. కొడవలి గ్రామ పంచాయతీ శానిటరీ సిబ్బంది సహకారంతో పోలీసులు పోలవరం కాలువ నీటిలోకి దిగి, బోర్లపడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని బయటకు తీయించారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం, శవాన్ని అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్ష కొరకు తరలించారు. ఈ ఘటనపై గొల్లప్రోలు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన వ్యక్తి ఎవరు? ఎక్కడి నుండి వచ్చారు? ప్రమాదవశాత్తూ కాలువలో పడి చనిపోయారా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం




**చింతూరు ఆగస్టు 29 ప్రజాజ్యోతి** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ విభాగం ఆధ్వర్యంలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.మణిమాల గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగు భాషకు,సరళత,సమానత్వం, ప్రజల నాడీకి దగ్గరగా ఉండేలా చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులుగారు అని, పండితులకే పరిమితమైన గ్రాంథిక భాషను కాదని, సామాన్యులు మాట్లాడే వాడుక భాషను ( వ్యవహారిక భాష ) సాహిత్యానికి, చదువుకు అనుకూలంగా మార్చాలని ఆయన పోరాడారన్నారు. గిడుగు రామ్మూర్తి చేసిన కృషి వల్ల చదువు అందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర దేశంలో వ్యవహారకభాషా ఉద్యమానికి మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి అని, పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకత శక్తి ఉన్న ప్రతి ఒక్కరికి విద్యను అందేలా చేశారని, శిష్ట జన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు మన గిడుగు రామ్మూర్తి అనీ కొనియాడారు. తెలుగు విభాగధిపతి కె.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఆధునిక తెలుగు భాషానిర్మాతల్లో ముఖ్యుడని ఉపాధ్యాయుడు, చరిత్ర, శాసన పరిశోధకుడు, వక్త, విద్యావేత్తని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించి, ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, డాక్టర్ జి.ఝాన్సీ, ఆర్ మౌనిక, జి.సాయికుమార్ బి. శ్రీనివాసరావు, కె.కీర్తి, ఆర్.కిరణ్మయి, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అవుట్సోర్సింగ్ మెడికల్ ఉద్యోగుల భారీ ధర్నా

చింతూరు ఏరియా ఆసుపత్రి నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ, రెగ్యులరైజేషన్ చేయాలంటూ నినాదాలు.



**చింతూరు ఆగస్టు 29 ప్రజాజ్యోతి** హామీ ఇచ్చిన విధంగా రెగ్యులరైజేషన్ చేయకపోతే కలెక్టరేట్లు ముట్టడిస్తామంటూ హెచ్చరిక పోలవరం జిల్లా చింతూరు ఏజెన్సీలో ఔట్సోర్సింగ్ మెడికల్ ఉద్యోగులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ర్యాలీగా రాజీవ్ గాంధీ విగ్రహం వరకు వచ్చి మానవహారం నిర్వహించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులర్ చేయాలంటూ నినాదాలు చేశారు. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వానికి ఎన్నో సేవలు చేశామని గుర్తు చేసుకుంటూ.. ఆ సేవలను గుర్తించి మాకు రెగ్యులర్ ఉద్యోగులు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. చాలీచాలని జీతాలతో నానా అవస్థలు పడుతున్నామంటూ ఆవాపోయారు. గతంలో హామీ ఇచ్చినట్లుగా రెగ్యులర్జేషన్ చేయకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామంటూ హెచ్చరించారు.

## వర్షం కోసం తుంగభద్ర జలంతో ప్రత్యేక పూజలు

ముగతి గ్రామంలో ఘనంగా జలాభిషేకం

-- పంటలు సమృద్ధిగా పండాలని రైతుల ఆకాంక్ష



**నందవరం, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ మండల పరిధిలో ని ముగతి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా చేపట్టిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ప్రతి ఏడాది ఆనవాయితీగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు ముగతి నుంచి తుంగభద్ర నది వరకు కాలినడకన వెళ్లి గంగాజలాన్ని తీసుకొచ్చారు. అనంతరం ఆ పవిత్ర జలంతో గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాల్లో జలాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టి వరుణ దేవుడిని వర్షాలు కురిపించాలని ప్రార్థించారు.సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, సాగునీటి వనరులు సమృద్ధిగా మారాలని, పంటలు పచ్చగా కళకళలాడాలని రైతులు ఆకాంక్షించారు. గ్రామంలో సుఖశాంతులు, సౌభాగ్యం నెలకొనాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వర్షాల కోసం గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## స్వర్గీయ నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులుఅర్పించినలి

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్

నాయకుడు గాజుల ఖాదర్బాషా



**రాయచోటి ఆగస్టు 29 ప్రజా జ్యోతి** సూర్యచంద్రులు ఉన్నంతవరకు స్వర్గీయనందమూరి హరికృష్ణ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు.స్వర్గీయ నందమూరి హరికృష్ణ గారి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు గాజుల ఖాదర్ బాషా అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నిండైన ఆత్మీయతకు ఆత్మ ప్రతిరూపం నందమూరి హరికృష్ణ గారు అని కొనియాడారు తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యునిగామరియు మంత్రిగా శాసనసభ్యుడిగా రాజ్యసభ సభ్యుడిగా తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గాజుల ఖాదర్ బాషా తెలిపారు.

## విద్యార్థులకు లైన్స్ క్లబ్ చేయూత

--పుస్తకాలు,పెన్నులు,పెన్సిళ్లు,స్కేల్స్ అందజేత.

--విద్యార్థులతో రాఖీలు కట్టించుకున్న లైన్స్ క్లబ్ ప్రతినిధులు.

--ముఖ్య అతిథిగా ఏపీ జెన్‌కో ఏడీఈ ఫణికుమార్.



**మోతిగూడెం ప్రజాజ్యోతి ఆగస్టు 29 :** రాఖీ పౌర్ణమి సందర్భంగా పొల్లూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు రాజమండ్రి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.మోతుగూడెం గ్రామానికి చెందిన మైలవరపు కిరణ్ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సభ్యులు పాఠశాలకు విచ్చేసి విద్యార్థులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు,పెన్సిళ్లు,స్కేల్స్ తదితర విద్యా సామగ్రిని అందజేశారు.అనంతరం విద్యార్థులతో రాఖీలు కట్టించుకుని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని లైన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ జెన్‌కో ఏడీఈ ఫణికుమార్ హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టేషనరీని అందించిన రాజమండ్రి లైన్స్ క్లబ్ సభ్యులకు గ్రామం తరపున,ఎంపీపీ పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పేపకాయల శ్రీను,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు మండలంలో నేడు విద్యుత్ అంతరాయం



**కాకినాడ జిల్లా ఆగస్టు 29(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనుల కారణంగా ప్రత్తిపాడు మండల పరిధిలోని పలు గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.వ్యవసాయ బోర్లకు మాత్రం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు,తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ మార్పును గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని వీరభద్రరావు కోరారు.

## తెలుగు భాషను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత-డా.ఒమ్మి రఘురామ్

--స్వామి వివేకానంద విద్యాసంస్థల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం




**కాకినాడ జిల్లా ఆగస్టు 29(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా మన సంస్కృతి,సంప్రదాయం,చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించి పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీ స్వామి వివేకానంద విద్యాసంస్థల అధినేత డా.ఒమ్మి రఘురామ్ పేర్కొన్నారు.శ్రీ స్వామి వివేకానంద విద్యాసంస్థల్లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ మాతృభాషను గౌరవిస్తూనే ఇతర భాషలను కూడా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.గిడుగు వెంకట రామమూర్తి పంతులు వ్యావహారిక భాషను ప్రజలకు చేరువ చేసేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మర్చిపోకూడదని, తెలుగు పుస్తకాలు చదవడం,పద్యాలు,కథలు,సామెతలు,జానపద గేయాలను తెలుసుకోవడం ద్వారా భాషపై పట్టు పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పద్యాలు,ప్రసంగాలు,కథలు,నాటికలు తదితర కార్యక్రమాలతో తమ ప్రతిభను ప్రదర్శించారు.అనంతరం గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి డా.ఒమ్మి రఘురామ్,ఉపాధ్యాయులు,విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,తెలుగు విభాగం సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్యాపిలి ప్రియాసిమెంట్ ఫ్యాక్టరీ గ్రామాల ప్రజల ఆందోళన



**ప్యాపిలి (ప్రజాజ్యోతి న్యూస్) ఆగస్టు 29** ప్యాపిలి మండలం రాచర్ల ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీ ఎదురుగా పలు గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన శనివారం కూడా కొనసాగింది ఆందోళన నేపథ్యంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జిల్లా ఇన్చార్జ్ బసీరుఉన్నీసా, ఇండస్ట్రియల్ అధికారి చంద్రశేఖర రావు, ఆర్డీవో నరసింహులు, సీఐ వెంకటరామి రెడ్డి, తదితరులు ఆందోళనకార్లతో మాట్లాడారు డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని అంటున్న గ్రామ ప్రజలు ఆందోళన కారులు స్పష్టం చేశారు

## రాష్ట్రస్థాయికీ ఎంపికైన విద్యార్థికి 500 రూపాయలు బహుమతి ఇచ్చిన గ్రామ పెద్దలు లక్ష్మిరెడ్డి



**కౌతాళం ఆగస్టు 29 ప్రజా జ్యోతి** ఒక మారుమూల గ్రామమైన బదినేహాల్ గ్రామం,కౌతాళం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి, వన్నూర్బీ బి అనే విద్యార్థిని తనకు ఆటల మీద ఉన్న మక్కువతో ప్రతిదీ అకుంఠిత దీక్షతో తర్ఫీదు తీసుకొని తిరుపతి వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అథ్లెటిక్స్ విభాగంలో ఎంపిక అయింది.డిస్కస్ త్రో ఆటలలో తన ప్రతిభతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బదినేహాల్ కు ప్రాతినిధ్యం వహించింది. అయితే తన ప్రతిభను గుర్తించి గ్రామాన్ని రాష్ట్రస్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహించినందు కు గాను గ్రామ పెద్దలు అయినటువంటి లక్ష్మిరెడ్డి 500 రూపాయలు బహుమతిగా అందించారు. అందుకుగాను పాఠశాల సిబ్బంది హెచ్ఎం ఈరమ్మ గారు, అలాగే పిఈటీ మేడం రూప బృందం వారికి కృతజ్ఞత తెలియజేశారు.

## జాజ్వల్య స్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**తెలుగు భాషను గౌరవించి, ప్రేమించాలి**
**కరస్పాండెంట్ సిహెచ్. ఉషారాణి**
**విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు**
**విజేతలకు బహుమతులు**

**ఎటపాక, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):** గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం ఎటపాకలోని జాజ్వల్య స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో మాతృభాషపై అభిమానం, తెలుగు సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు 'తెలుగు సాహిత్య వైభవం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించగా, 'తెలుగు కవులు--వారి రచనలు' అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్. ఉషారాణి మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో గొప్పదని, తీయనైన భాషగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా ప్రపంచ మేధావులు కొనియాడారని గుర్తుచేశారు. శ్రీకృష్ణదేవరాయలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అని ప్రశంసించిన విషయాన్ని ప్రస్తావించారు. తెలుగు వంటి మహోన్నతమైన భాషకు నేటి పిల్లలే వారసులని, ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించి, ప్రేమించి, పరిరక్షించాలని ఆమె సూచించారు. గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాషా ఉద్యమాన్ని నిర్వహించి, తెలుగు భాషను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన చేసిన భాషా సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ భాషా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషా వికాసం, వైభవాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు యజ్ఞజ, జాజ్వల్య, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాజ్వల్య స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది

## చేతివృత్తుల వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం.





**పండితవిల్లూరు సభలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ వెల్లడి.**

**పోడూరు. ప్రజా జ్యోతి ఆగస్టు 29.** కేంద్ర ప్రభుత్వం 18 రకాల చేతి వృత్తుల వారిని గుర్తించి వారికి ఆర్థిక భరోసా కల్పించేటందుకు 13 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. పోడూరు మండలం పండితవిల్లూరులో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో 115 మంది మహిళలకు మంజూరైన కుట్టుమిషన్లను శనివారం జరిగిన సభలో స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణతో కలిసి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ పంపిణీ చేశారు. మహిళలకు సాధికారిత రావాలంటే వారికి ఆర్థిక భరోసా కల్పించాలని అందుకే ప్రధానమంత్రి ఈ విశ్వకర్మ యోజన కార్యక్రమం చేపట్టారని అన్నారు చేతివృత్తుల వారికి 15 వేల రూపాయల విలువైన వారి వృత్తికి సంబంధించిన కిట్లను అందజేయ్యటం జరుగుతున్నదన్నారు. అదేవిధంగా మహిళలకు టైలరింగ్ పనిలో 15 రోజులపాటు శిక్షణ ఇచ్చి ఇవ్వటమే కాకుండా వారికి శిక్షణ ధృవీకరణ పత్రాలను ఐడి నెంబర్ ను ఇచ్చి కుట్టు మిషన్ లను ఇవ్వటం జరుగుతున్నదన్నారు. ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గం లో మహిళలకు మంజూరయి వచ్చిన విషయాన్ని స్థానిక శాసనసభ్యులకు సంబంధిత శాఖ అధికారులు తెలియచేయకపోవడం శోచనీయమన్నారు. కొంతమంది అధికారులకు పాత వాసనలు పోలేదని అటువంటి అధికారు లను గుర్తించి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి శ్రీనివా సవర్మ తెలిపారు.ఆచంట శాసన సభ్యులు పితాని సత్యనా రాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకంలో మహిళలకు మంజూరు చేసిన కుట్టుమిషన్లు సద్విని యోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచిం చారు.పితాని సత్యనారాయణ అధ్యక్షతన సభ జరుగగా నియో జకవర్గ తెలుగుదేశం నాయకులు గణపతినీడి రామ్మోహన్ అతిథులను వేదిక పైకి స్వాగతించారు పండితవిల్లూరులో మహిళలకు మంజూరై వచ్చిన కుట్టు మిషన్లను స్థానిక శాసన సభ్యుల అనుమతితో కేంద్ర సహాయ మంత్రివర్యులు చేతుల మీదుగా ఇప్పించాలన్న కోరికకు తొలుత సంబంధిత శాఖ అధికారులు సహకరించక పోవటం బాధ కలిగినా అనుకున్న రీతిలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ సమావేశాలతో కేంద్ర మంత్రివర్యులు రావటం ఆలస్యమైనా మా అభర్థనను మన్నించి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సభలో కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ యువ నాయకులు పితాని వెంకట్ లను గణపతినీడి రామ్మోహన్ స్థానిక కూటమి నాయకులతో కలసి గజమాలలతో సత్కరించారు. స్థానిక నాయకులు కొరిపల్లి రాము వెలగల రామకృష్ణ కేతా మీరయ్య ఉప్పలపాటి జగదీష్ బాబు రుద్రరాజు రమేష్ రాజు తహసిల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ ఎంపీడీవో బి మంగ కుమారి పంచాయతీ కార్యదర్శి సుబ్బలక్ష్మి బిజెపి నాయకులు చింతపల్లి రమేష్ శెట్టి కార్యదర్శి పెద్దిరాజు స్థానిక కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పూసల సంఘం నాయకులు

**ఆగస్టు 29 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు సి. లింగమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో, ఆంధ్రప్రదేశ్ పూసల సంఘం జిల్లా అధ్యక్షులు పూసల హనుమంతు మాట్లాడుతూ మరియు ఇతర నాయకులు ప్రధానంగా ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు మరియు ఇతర నాయకులు ప్రధానంగా ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు చేతి వృత్తిదారుల రక్షణ ఆధునిక సాంకేతికత మరియు కార్పొరేట్ కంపెనీల పోటీ వల్ల కుల వృత్తులు, చేతి వృత్తులు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడటానికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో సుమారు 3 లక్షల జనాభా ఉన్న పూసల సామాజిక వర్గం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన పూసల కులాన్ని మన ప్రభుత్వం వస్తే ఎస్టీ జాబితాలో చేడుస్తానని ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చినాడు ఆంధ్రప్రదేశ్లో పూసల కులం చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఈ సమాజం ఆర్థికంగా సామాజికంగా ఎంతో వెనుకబడి ఉంది. పూసల సామాజిక వర్గ సమస్యలు పూసల సంఘం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించాలని ఒత్తిడి తెచ్చారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు అమలు కోసం ఎదురుచూస్తున్న పూసల కులస్తుల ఆర్థిక సహాయం మరియు రుణాలు చేతి వృత్తిదారుల బతుకుదెరువు కోసం బ్యాంకు గ్యారెంటీ లేకుండా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరారు. బీసీ కార్పొరేషన్ లో ఎస్టీ కార్పొరేషన్ మైనార్టీ కార్పొరేషన్ ఎస్సీ కార్పొరేషన్ లో నిధులు అమలు చేయాలని సంక్షేమ బోర్డుల పునరుద్ధరణ: కుల వృత్తుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు, సంక్షేమ బోర్డులకు తగిన నిధులు కేటాయించి వాటిని చురుగ్గా నిర్వహించాలి సాధారణంగా ఇలాంటి చేతి వృత్తిదారుల మరియు కుల వృత్తుల సంఘాల ధర్నాలలో పూసల హనుమంతు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




## ఎస్ వి విద్యామందిర్ హైస్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**రాయచోటి ఆగస్టు 29 ప్రజా జ్యోతి** ఎస్ వివిద్యామందిర్ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసే వివిధ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు భాష అభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అప్పట్లో ప్రజలకు కష్టంగా ఉన్న గ్రాంథిక భాషకు బదులుగా అందరికీ సులభంగా అర్థమయ్యే వ్యావహారిక భాషను ప్రోత్సహించేందుకు గిడుగు వెంకట రామమూర్తి విశేషంగా కృషి చేశారని తెలిపారు.తెలుగు భాష మన సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం, మన వ్యక్తిత్వానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ తెలుగు భాషను ప్రేమించి, పరిరక్షించాలని డాక్టర్ సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. అదే సమయంలో ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషను కూడా నేర్చుకోవడం ఎంతో అవసరమని, అయితే ఇతర భాషలను నేర్చుకుంటూనే మాతృభాష తెలుగును గౌరవించి, ప్రేమించాలని విద్యార్థులకు సూచించారు. తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని తెలుగు భాష పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు జాయింట్ కలెక్టర్ భావన ఐఏఎస్‌తో కలిసి అర్జీల స్వీకరణ**

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టిన నాలుగు సదస్సులురెవెన్యూ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన చమర్తి**





**రాజంపేట, ఆగస్టు 29 ప్రజా జ్యోతి** కూటమి ప్రభుత్వం ప్రజల దీర్ఘకాలిక భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు స్పష్టం చేశారు. "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సదస్సులు" అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా వేలాది మంది రైతులకు, సామాన్య ప్రజలకు మేలు జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన ఐఏఎస్‌తో కలిసి చమర్తి జగన్మోహన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల నుంచి అధికారులు నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు రెవెన్యూ సదస్సులు అత్యంత విజయవంతమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని, వాటిని చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇలాంటి సదస్సుల ద్వారా నేరుగా సమస్యలకు మోక్షం లభిస్తుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. నాలుగు సదస్సులను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల అర్జీలను పరిష్కరించడంలో అంకితభావంతో పనిచేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరికీ ఆయన పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కలచట్ల గ్రామంలో రంగస్వామి ఊరేగింపు




**ప్యాపిలి ( ప్రజాజ్యోతి న్యూస్) :** ప్యాపిలి మండలంలో ని కలచెట్ల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వెలసిన దేవరకొండ రంగస్వామి గత 60 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం శ్రావణమాసం నందు నాగుల పంచమి తర్వాత మూడవ వారంలో రంగస్వామి కొండమీద నుంచి భక్తిశ్రద్ధలతో ఒక పండుగలా స్వాములవారిని గ్రామంలో ఊరేగింపుగా ప్రతి గడవగడపకు ఊరేగింపుగా చేయడం ఆ కాలంనాటి నుండి ఆనవాయితుగా జరుగుతుంది స్వాములవారిని ఊరేగించినమరుక్షణం వరుణ దేవుడు కరుణించి వర్షం రావడం జరుగుతుంది అని గ్రామ ప్రజలు నమ్మకంతో ఎంతో ఘనంగా జరపడం జరుగుతుంది. శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు అన్న దాసోహం కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు శ్రావణమాసం ఉత్సవం కమిటి నిర్వాహకులు, పూజారులు తెలిపారు. కావున గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. ఈ సందర్భంగా శ్రావణమాసం ఉత్సవ కమిటి నిర్వాహకులు, యజమానులు, తదితరులు మాట్లాడుతూ.. ప్రతి సం వత్సరం శ్రావణమాసం మూడవ శనివారం దేవరకొండ శ్రీ రంగస్వామి వారిని ప్రతి ఒక్కరూ పల్లకిని మోస్తూ, భజనలు చేస్తూ వరుణ దేవుడిని కరుణించి ఒక పండుగలా జరుపుకోవడం జరుగుతుంది. కొండమీద స్వాముల వారికి చేసినటువంటి ప్రసాదములు గ్రామంలో ప్రతి ఒక్కరికి అందజేయడం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# పాలకొల్లులో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం వేడుకలు



**పాలకొల్లు ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 29.** తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక బి. ఆర్. ఎమ్. వి. ఉన్నత పాఠశాలనందు పాలకొల్లు మండల విద్యాశాఖ, స్థానిక రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు సీనియర్ విభాగంలో 8,9 తరగతులకు "తెలుగుభాషా మాధుర్యం", జూనియర్ విభాగంలో 6,7 తరగతులకు "పోతన, వేమన, దేవరకొండ బాలగంగాధరతిలక్" అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఎన్.వి.ఎస్. గంగాధరశర్మ విజేతలకు బహుమతులు అందచేసారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రసధుని ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం స్వాగతంపలుకగా, రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు అధ్యక్షతన వహించారు. ముఖ్యవక్త విశిష్ట కవి, మామిడిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుభాష కేవలం మనం మాట్లాడుకునే భాష మాత్రమే కాదని, మనసంస్కృతి, సాంప్రదాయం, మన చరిత్ర, మన భావోద్వేగాలకు ప్రతి రూపమన్నారు. ప్రతి సంవత్సరం ఆగష్టు 29వ తేదీన తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి రోజున తెలుగుభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు తెలుగుభాషను పండితుల గ్రాంధిక భాషనుండి సామాన్యులకు అర్థమయ్యే వ్యవహారికభాష వైపు తీసుకురావడానికి గిడుగు గొప్ప ఉద్యమం చేసి సఫలికృతులయ్యారన్నారు .అందుకే మన భాష ఇంత తియ్యగా, సుందరంగా, వినసొంపుగా ఉంటుందన్నారు. నన్నయ్య, తిక్కన, యర్రాప్రగడ వంటి మహాకవుల నుండి శ్రీనాధుడు,పోతన, అన్నమయ్య, వేమన శ్రీకృష్ణదేవరాయలు, గుజాడ, శ్రీశ్రీవంటి మహనీయులను తెలుగుభాష అక్కున చేర్చుకుందని వివరించారు. ఈ సభలో బి. ఆర్.ఎమ్.వి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎమ్.శివలీల, బిసి వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. సూర్యకుమారి అతిధులుగా పాల్గొన్నారు అతిథులను, ముఖ్య వక్తను వి.వి.ఎస్.ఎన్. రాజు, కోలాటి పెద్దిరాజు, జక్కుల నాగేశ్వరరావు, అనిశెట్టి వెంకటేశ్వరరావు, గిడుగు శ్రీనివాసరావులు సంయుక్తంగా సత్కరించారు. కలిదిండి వెంకటపతి వర్మ, జి ఎస్ ఎన్ మూర్తి,భట్టిప్రోలు సత్యనారాయణ, వామనమూర్తి, ఉపాధ్యాయులు నిర్మలా రాణి, దక్షిణమూర్తి, రోజా, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ నమస్కారం!..

**నేడురామవరం పంచాయతీ!..**

**రామవరం గ్రామంలో!..**

**అత్యవసర సమావేశం!..**

**తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**



**వి.ఆర్.పురం,ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** నేడు 30/8/2026 న రామవరం పంచాయతీ రామవరం, గ్రామం కూర లక్ష్మయ్య, ఇంటినందు తెలుగుదేశం పార్టీ,అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బొర్ర నరేష్ కుమార్, వివరించారు. శనివారం, ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు, మరియు అనుబంధ కమిటీల సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు, జడ్పీ.టి.సి,ఎం.పీ. టీ.సీ,లు, మాజీజెడ్పీ. టి.సి,లు, మాజీ ఎం.పీ.టీ.సీ,లు, మాజీ సర్పంచులు,రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలకు సంబంధించిన అన్ని పదవుల్లోఉన్ననాయకులు, సీనియర్, నాయకులు, పార్టీముఖ్య కార్యకర్తలు అందరూ తప్పకుండా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.ప్రెస్ నోట్ విడుదల చేసిన వారిలోప్రధాన కార్యదర్శిపాయం రామారావు, జడ్పీ.టి.సి,సభ్యులు వాళ్ల రంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

## పి ఎం. సరి.టీ సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాష మరియు జాతీయ క్రీడా దినోత్సవం




**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేడు తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు పద్య పటనం, నాటికలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమావేశంలో తెలుగు భాష ప్రాధాన్యత, ఆవశ్యకత, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ లో తెలుగు పోషిస్తున్న పాత్ర గురించి తెలుగు ఉపాధ్యాయులు మల్లికార్జున, మస్తాన్ వలి, చంద్రబాబు నాయుడు, కేశవరెడ్డి వివరించారు. జాతీయ క్రీడా దినోత్సవం లో భాగంగా గత నాలుగు రోజుల నుండి వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఖో ఖో, వాలీబాల్, కబడ్డీ, లాంగ్ జంప్, హై జంప్ మొదలైన అంశాల్లో పోటీలు నిర్వహించి, నేడు ధ్యాన్ చంద్ జన్మదినశీ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందించారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, రామకృష్ణ, నవీన్ కుమార్ నిత్యజీవితంలో క్రీడల ప్రాధాన్యత, ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కే రామ్ కుమార్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# సారూ... ఆపండి అన్నా..!

**విద్యార్థులు వేడుకున్నా కదిలిన ఆర్టీసీ బస్సు**

**బస్ పాస్‌లు ఉన్నా.. సర్వీస్ ఆటోలే దిక్కు డ్రైవర్, కండక్టర్ తీరుపై విద్యార్థుల ఆవేదన**

**పాఠశాల వేళల్లో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్**



ఆర్టీసీ బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు - తోటపల్లి బస్టాండ్



ఎటపాక మండలం తోటపల్లి బస్టాండ్ వద్ద బస్సు ఎక్కేందుకు వేడుకున్నా ఆపకుండా వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు.

**ఎటపాక, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):** "సారూ... ఆపండి అన్నా వెనుక ఖాళీగానే ఉంది.. కొంచెం ఆపండి.. మేము కూడా ఎక్కి వెనక్కి వెళ్తాం" అంటూ విద్యార్థులు వేడుకున్నా ఆర్టీసీ సిబ్బంది పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ప్రతిరోజూ ఇదే తరహా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. శనివారం పోలవరం జిల్లా ఎటపాక మండలం తోటపల్లి బస్టాండ్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాల సమయం ముగియడంతో విద్యార్థులు గోకవరం డిపోకు చెందిన కూనవరం నుంచి భద్రాచలం వైపు వెళ్లే సాయంత్రం ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూశారు. బస్సు రాగానే ఇంటికి వెళ్లేందుకు విద్యార్థులు బస్సు వద్దకు చేరుకున్నారు. అయితే ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు బస్సు ఎక్కిన వెంటనే డ్రైవర్ బస్సును కదిలించేందుకు ప్రయత్నించాడని మిగిలిన విద్యార్థులు తెలిపారు. దీంతో కింద ఉన్న విద్యార్థులు గట్టిగా కేకలు వేస్తూ "డ్రైవర్ సార్.. కండక్టర్ సార్.. వెనుక ఖాళీగా ఉంది.. కొంచెం ఆపండి.. మేము కూడా ఎక్కుతాం" అంటూ వేడుకున్నప్పటికీ బస్సును ఆపకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. అంతేకాకుండా వెళ్తూ తమతో ఆగ్రహంగా మాట్లాడారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**బస్ పాస్ ఉన్నా.. ఆటోలే దిక్కు**

ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో బస్ పాస్‌లు తీసుకుని ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లోనే పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నామని విద్యార్థులు తెలిపారు. అయితే పాఠశాల ముగిసే సమయంలో సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సర్వీస్ ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. బస్ పాస్ ఉన్నప్పటికీ ప్రతిరోజూ అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయారు.

**తల్లిదండ్రుల ఆగ్రహం**

బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల పరిస్థితిని చూసిన కొందరు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులు బస్సు ఎక్కేందుకు వేడుకుంటున్న సమయంలో బస్సును ఆపకుండా వెళ్లిపోవడం సరికాదన్నారు. విద్యార్థులతో ఆర్టీసీ సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని, వారి ఇబ్బందులను అర్థం చేసుకోవాలని కోరారు.

**పాఠశాల వేళల్లో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి**

పాఠశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో విద్యార్థుల రద్దీకి అనుగుణంగా అదనపు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

**ప్రతిరోజూ ఇదే సమస్య.. అధికారులు స్పందించరా?**

తోటపల్లి బస్టాండ్ వద్ద విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులు ప్రతిరోజూ పునరావృతమవుతున్నాయని వారు చెబుతున్నారు. బస్ పాస్‌లు ఉన్న విద్యార్థులు సైతం అదనపు డబ్బులు చెల్లించి ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి పాఠశాల వేళలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని కోరుతున్నారు.

## డాక్టర్ చల్లా రవికుమార్ కు గుణ్ణం రాంబాబు ఆత్మీయ అభినందన.



**ఆలమూరు ఆగష్టు 29(ప్రజాజ్యోతి ):**అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ, బాల మందిరం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన కథల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన ప్రముఖ రచయిత డాక్టర్ చల్లా రవికుమార్ ను శనివారం సాయంత్రం గుమ్మిలేరు మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు అభినందించారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. మానవీయ విలువలను చాటిచెబుతూ "మనుషులు కోల్పోయిన మనిషి" అనే కథను రచించి బహుమతిని గెలుచుకోవడం అభినందనీయమని గుణ్ణం రాంబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డా.చల్లా రవికుమార్ భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని తన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# గిడుగు రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం

**– డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ మధుసూదన రావు**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి ఎనలేనిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ మధుసూదన రావు అన్నారు. ప్రముఖ భాషావేత్త , తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని పొందూరు మండల కేంద్రంలో స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ మధుసూదన రావు మాట్లాడుతూ తెలుగు భాష యొక్క విశిష్ఠత , ప్రాచీనత , మాధుర్యం , సాహిత్య వైభవం గురించి వివరించారు. గ్రాంథిక భాష సంకెళ్ళ నుండి వ్యవహారిక భాషకు విముక్తి ని కల్పించి తెలుగు భాషకు తియ్యదనాన్ని ,మాధుర్యాన్ని అందించిన భాషా శాస్త్రవేత్త గిడుగు అని కొనియాడారు. వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడిగా జీవిత కాలం వ్యవహారిక భాష కోసమే ఆయన పోరాటం చేశారని తెలిపారు. తెలుగుభాష తో పాటు సవర లిపి కనుగొని భోషోద్యమానికి చేసిన కృషికి బ్రిటీష్ ప్రభుత్వం నుంచి రావ్ బహుదూర్ అనే బిరుదు ను పొందారన్నారు. నేటి ఆధునిక కాలంలో తెలుగు భాషను పరిరక్షించడం , అభివృద్ధి చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తెలుగు భాషపై అభిమానం పెంపొందించుకుని ,దైనందిన జీవితంలో తెలుగును విస్తృతంగా వినియోగించాలని సూచించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. విజేతలను అభినందిస్తూ విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

# ఉపాధి పనుల్లో అక్రమాలపై సామాజిక తనిఖీ





**రూ.7.72 కోట్ల పనుల్లో అవకతవకలు..**

**క్షేత్రస్థాయి పరిశీలనలో పలు లోపాలు గుర్తింపు**

**ఎమ్మిగనూరు, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో అక్రమాలు, అవకతవకలను వెలికితీసేందుకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మిగనూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. వీబీజీ రామ్‌జీ సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు పీడీ నరసింహారెడ్డి, అడిషనల్ పీడీ లోకేశ్వర్, ఎంపీడీవో బంగారమ్మ, ఏపీవో శ్రీనివాసులు హాజరయ్యారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.7.72 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో ఆయా పనులను పరిశీలించి, గ్రామాల వారీగా పనుల ప్రగతి, ఖర్చులు, లబ్ధిదారుల వివరాలను సేకరించి ప్రజా వేదికలో నివేదికలను సమర్పించాయి.

**క్షేత్రస్థాయి పరిశీలనలో పలు లోపాలు:**

ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాల్సిన పనుల బోర్డులు సక్రమంగా ఏర్పాటు చేయలేదని సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. అలాగే పండ్ల తోటల పెంపకం పనుల్లో రికార్డుల్లో మొక్కలు ఉన్నట్లు చూపించినప్పటికీ క్షేత్రస్థాయిలో మొక్కలు కనిపించని సందర్భాలు ఉన్నట్లు తనిఖీలో వెల్లడైంది.కాల్వలు, ఫీడర్ చానల్స్‌లో చేపట్టిన పూడికతీత పనుల్లోనూ రికార్డుల్లో నమోదు చేసిన కొలతలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పనుల కొలతలకు తేడాలు ఉన్నట్లు బృందం గుర్తించింది. పనుల వారీగా ఈ వ్యత్యాసాలను ప్రజా వేదికలో అధికారులు, ప్రజల దృష్టికి తీసుకువచ్చారు.

**పని చేయకున్నా వేతనాల చెల్లింపులు?**

ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన జాబ్ కార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయకపోవడం, కొందరు కూలీలు వాస్తవంగా పనులకు హాజరు కాకపోయినా వారి పేర్లపై వేతనాలు చెల్లించినట్లు నమోదైన ఘటనలు కూడా సామాజిక తనిఖీలో వెలుగుచూసినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, నాణ్యత, కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, రికార్డులు-- క్షేత్రస్థాయి పనుల మధ్య వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ప్రజలు కోరారు. సామాజిక తనిఖీ ద్వారా వెలుగులోకి వచ్చిన అంశాలపై సంబంధిత అధికారులు తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రజా వేదికలో సూచించారు.

# మోడల్ స్కూల్‌లో అష్టావధానం

## విద్యార్థులను అలరించిన అవధాని డాక్టర్ గంగుల నాగరాజు



**బేతంచెర్ల:ఆగస్టు29(ప్రజా జ్యోతి)** మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని గోరుమానుకొండ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో అష్టావధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ మరియదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ వైష్ణవ వెంకటరమణమూర్తి సంచాలకత్వం వహించారు. అష్టావధానిగా డాక్టర్ గంగుల నాగరాజు వ్యవహరించారు.ప్రార్థనతో ప్రారంభమైన అష్టావధానంలో నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, వర్ణన, ఆశువు, అప్రస్తుత ప్రసంగం, గేయం, పురాణ పఠనం తదితర అంశాలను నిర్వహించారు. అనునాసికాలు లేకుండా నిషిద్ధాక్షరిని పూర్తి చేయడం, రసవంతమైన సమస్యను పూరించడం, 'పెరుగు, కారం, చారు, సాంబారు' పదాలతో కరువు తొలగి వర్షాలు కురవాలనే భావంతో దత్తపదిని నిర్వహించడం విశేషంగా ఆకట్టుకుంది.తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ విజయంపై వర్ణన, అమెరికా యుద్ధ భీతిపై ఆశువుగా పద్యాలు, తెలుగు బోధనలోని తియ్యదనంపై పద్యాలు చెప్పి అవధాని సభికులను అలరించారు. చమత్కారయుక్తమైన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ అప్రస్తుత ప్రసంగంతో నవ్వులు పూయించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి పథకంపై 'నీ మాటకు నా పాట' అంటూ పాట పాడారు. నవ సమాజ నిర్మాణంలో గురువులు, గురుకులాల ప్రాముఖ్యతను వివరిస్తూ మరో పాటను ఆలపించారు. పురాణ పఠనంలో బమ్మెర పోతనామాత్యుని పద్యాలను మధురంగా ఆలపించారు.ఈ సందర్భంగా డాక్టర్ వైష్ణవ వెంకటరమణమూర్తి మాట్లాడుతూ.. తన వద్ద పద్యవిద్యను అభ్యసించిన శిష్యుడు డాక్టర్ గంగుల నాగరాజు గొప్ప అవధానిగా రాణించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే శతావధానం నిర్వహించాలని ఆకాంక్షించారు. అవధాని డాక్టర్ గంగుల నాగరాజు మాట్లాడుతూ.. తెలుగులోని క్లిష్టమైన ప్రక్రియల్లో అవధానం అద్భుతమైనదని, మేధస్సుకు, ఏకాగ్రతకు అవధానం పెట్టింది పేరన్నారు. తాను పనిచేస్తున్న పాఠశాలలో అష్టావధానం నిర్వహించడం గొప్ప అనుభూతినిచ్చిందని తెలిపారు.ప్రిన్సిపల్ మరియదాసు మాట్లాడుతూ.. అష్టావధానం రసభరితంగా సాగిందని, విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించేలా కార్యక్రమం సాగిందని కొనియాడారు. కార్యక్రమానికి విచ్చేసిన తెలుగు పండితులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నందిపల్లె నారాయణకు మీడియేషన్ సర్టిఫికెట్

**డోన్:ఆగస్టు 29(ప్రజా జ్యోతి)** డోన్‌కు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది నందిపల్లె నారాయణకు ఏపీ హైకోర్టు మీడియేషన్ సర్టిఫికెట్ లభించింది. 2025లో ఏపీ హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియేషన్ శిక్షణను ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. శనివారం కర్నూలు జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జడ్జి కబర్ది, డీఎల్ఎస్ఏ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు. కర్నూలు ఉమ్మడి జిల్లాకు చెందిన 2025 బ్యాచ్‌లోని 27 మంది మీడియేటర్ అడ్వకేట్లకు సైతం సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా నందిపల్లె నారాయణ మాట్లాడుతూ.. డోన్ కోర్టు కాంప్లెక్స్‌లో ఇప్పటి వరకు 18 కేసులను ఇరువర్గాల కక్షిదారులు, వారి న్యాయవాదుల సమక్షంలో మీడియేషన్ ద్వారా ఉచితంగా పరిష్కరించినట్లు తెలిపారు. మీడియేషన్ ద్వారా ఇరువర్గాల అంగీకారంతో కేసులను స్నేహపూర్వకంగా, తక్కువ సమయంలో పరిష్కరించుకోవచ్చన్నారు. సాధారణంగా మూడు నెలల్లోపు కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.




మీడియేషన్ ద్వారా పరస్పర అంగీకారంతో కేసు పరిష్కారమైతే సాధారణంగా అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు తమ న్యాయవాది, సంబంధిత కోర్టు జడ్జిని లేదా కర్నూలు జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## శ్రీ సాయిస్ఫూర్తి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం - 100 మందికి వైద్య పరీక్షలు



**తాళ్లపూడి, ఆగస్టు 29 ,ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలోని గ్రామ ప్రజలు, ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు, కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.దీనిలో భాగంగా శనివారం తాళ్లపూడిలో శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీస్ సిబ్బందితో పాటు సుమారు 100 మందికి పైగా వివిధ వ్యాధులకు సంబంధించి ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సీఈవో గూడా విజయరాజు, మేనేజింగ్ పార్టనర్ లింగంపల్లి సుధీర్, డాక్టర్లు శివ నాయక్, సంతోష్, జగదీష్, మౌనిక మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

**ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు**

**క్రీడలతోనే శారీరక దృఢత్వం.. క్రమశిక్షణ, సమష్టి కృషి అలవాటు**




**ఎటపాక, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):** హాకీ దిగ్గజం, భారత క్రీడా రంగంలో చిరస్మరణీయుడైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఎటపాక మండలం నల్లకుంట లోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు వివిధ క్రీడా పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీతో పాటు పలు సాంప్రదాయ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమష్టి కృషి, క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే క్రీడా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, గణపతి, రామదాసు, ఉపాధ్యాయులు మోహన్‌రావు, రామకృష్ణ, విజయకుమార్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం స్కూల్ ను తనిఖీ చేసిన లక్కిరెడ్డిపల్లె జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి సిహెచ్ భరత్ కమల్



**రామాపురం ఆగస్టు 29 ప్రజా జ్యోతి** రామాపురం మండలం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం స్కూల్ల రామపురం నందు లక్కిరెడ్డిపల్లె జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ స్టేట్ కోర్ట్ లక్కిరెడ్డిపల్లి జడ్జి సిహెచ్ భరత్ కమల్ సడన్ గా తనిఖీ చేసి స్కూల్ వాతావరణంమరియు ఫుడ్ క్వాంటిటీ స్టోర్ రూమ్ మరియు వాష్రూమ్స్ మొదలగునవి స్వయంగా పరిశీలించి పిల్లలతో ఇంట్రాక్ట్ అయి గల విషయాలు డిస్కస్ చేసి పిల్లల యొక్క బాగోగులు అడిగి తెలుసుకుని స్కూల్ వాతావరణ పరిస్థితులు మొదలగు విషయాలు అవగాహన చేసుకుని హాస్టల్లో చదువుకుని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని తెలియ పరచడమైనది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిన్న,స్కూల్ సిబ్బంది, రామాపురం కోర్ట్ కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.

## గజవాహనంపై సీతారామచంద్రస్వామి ప్రాకారోత్సము



**గుంతకల్లు ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవసానంలో శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా గజవాహనం పై శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల ప్రాకారోత్సవము నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మేడేపల్లి విజయరాజు, ప్రధాన అర్చకులు కే రాఘవాచార్యులు, వేద పండితులు అర్చకులు భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాపురం గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో వర్షం కోసం ప్రత్యేక పూజలు





## ఓ వరుణా దేవుడా కరుణించవయ్యా

**కౌతాళం ఆగస్టు 29 ప్రజాజ్యోతి** కౌతాళం మండల పరిధిలోని బాపురం గ్రామంలో శనివారం రోజున గ్రామ పెద్దల సమక్షంలో వర్షం కోసం 101 బిందెలతో గ్రామంలో తొమ్మిది గుడిల దేవతలకు ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు తుంగభద్ర నది నీటితో వర్షం రావాలని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. అదేవిధంగా గ్రామమంతా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పల్లకి సేవ చేయడం జరిగింది. గ్రామ ప్రజలంతా ఓ వరుణ దేవుడా కరుణించవయ్యా అని మొక్కుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు భక్తులు పాల్గొన్నారు

## నందవరం జడ్పీహెచ్ఎస్‌కు క్రీడా ప్రతిభా అవార్డు--2026



**నందవరం, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నందవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు--2026 లభించింది. క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు ఈ సందర్భంగా హెచ్ఎం బీఎస్ రామకృష్ణమరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉమాపతి, అబ్దుల్ లతీఫ్, సూరజ్‌లను సత్కరించారు. అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు మరియు అన్నదాన కార్యక్రమం



**రామాపురం ఆగస్టు 29 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చిట్లూరు గ్రామంలోని పవిత్ర శ్రావణమాసం 3వ శనివారం సందర్భంగా శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రామాపురం మండలం టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేంద్ర రెడ్డి గారు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద జనార్దన్ రెడ్డి శశికళ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రామాపురం మండల టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేంద్రారెడ్డి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సృజన్ స్కూల్లో ఘనంగా మాతృభాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)** తెలుగు భాష వైభవాన్ని కాపాడుకోవాలని శ్రీ సృజన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాదియా నూర్జహాన్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని స్థానిక శ్రీ సృజన్ పాఠశాలలో మేనేజింగ్ డైరెక్టర్ నూరుద్దీన్ ఆదేశాల మేరకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రపంచ భాషల్లోనే మధురమైన భాష తెలుగు భాష అని, తెలుగులో ఉన్న నుడికారాలు, సామెతలు, అలంకారాలు, ఛందో ప్రక్రియ మరే భాషలో లేవన్నారు. ప్రపంచంలో 6600 భాషలు ఉండగా తెలుగు 16వ స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి అయిన ఆగస్టు 29న మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని, మాతృభాషకు ఆయన చేసిన సేవ ఎనలేనిదన్నారు. అమ్మను ఎలా గౌరవిస్తామో మాతృభాషను అలాగే గౌరవించాలని, పరభాషా వ్యామోహంతో తెలుగును మరువ వద్దని విద్యార్థులకు సూచించారు. ఇతర భాషలు నేర్చుకోవడం తప్పుకాదని, అయితే తెలుగుపై మమకారాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, కృషి ఉంటే క్రీడల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. భాష కేవలం భావ వ్యక్తీకరణకే కాదని, మానవ సంబంధాలను అభివృద్ధి పరిచే సాంస్కృతిక ప్రతిబింబమన్నారు. అనంతరం



వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గిడుగు రామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు కె.స్వప్న, జి.ఫరీదా, వి.రోజీ, కె.హరిత, కె.భాగ్యలక్ష్మి, శ్రీదేవి, సుబ్బారావు, నాగరాజు, ఎర్రంరాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు ఘనంగా



**కర్నూలు: ఆగస్టు 29(ప్రజా జ్యోతి)** హాలహర్వి మండలం విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి గారి చిత్రపటానికి తెలుగు ఉపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ గారి చిత్రపటానికి క్రీడా ఉపాధ్యాయురాలు హిమశైలజ, ఉపాధ్యాయ బృందం పూలమాలలు సమర్పించారు. విద్యార్థిని వాసంతి గిడుగు వెంకట రామమూర్తి గారి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు హరిత, క్రీడా ఉపాధ్యాయురాలు హిమశైలజలను ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సన్మానించింది. విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యత, క్రీడల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బేతంచెర్లలో ఘనంగా జాతీయ క్రీడా, మాతృభాషా దినోత్సవాలు



**బేతంచెర్ల:ఆగస్టు29(ప్రజా జ్యోతి)**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్)లో మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు వెంకట రామమూర్తి జయంతుల సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ అబ్రహం సమక్షంలో, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ప్రసంగాలు, నృత్యాలు, వివిధ కళారూపాలను ప్రదర్శించారు. మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా రంగానికి అందించిన సేవలను, గిడుగు వెంకట రామమూర్తి మాతృభాష అభివృద్ధికి చేసిన కృషిని వక్తలు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ అబ్రహం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా జాతీయ గీతం ఆలాపనతో కార్యక్రమం ముగిసింది.

## తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని చైతన్య ఉపాధ్యాయులకు సన్మానం







**గుంతకల్లు ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** తెలుగు భాషా దినోత్సవాన్ని మరియు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించు కొని అనంతపురంలోని చైతన్య విద్యాసంస్థ అనంతపురం 7 బ్రాంచ్ లోని బ్రాంచ్ ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ పర్విన్ భాను తెలుగు ఉపాధ్యాయులు సోమశేఖర్, నీరజ, టి.జయమ్మ, జ్యోతిలకు శాలవాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ పర్విన్ భాను మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణలో మరియు విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణ, తెలుగు సంప్రదాయాల దుస్తులతో పాఠశాలలో తెలుగు దానం ఉట్టిపడేలా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ వీఆర్వో

**ఆత్రేయపురం ఆగస్టు 29(ప్రజాజ్యోతి):**రూ.16,500 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్వో రాజమహేంద్రవరం ఏసీబీ రేంజ్ పరిధిలోని క్రైం నం.07/ఆర్ సిటి-ఆర్ జెవై/2026, అవినీతి నిరోధక చట్టం (సవరణ)--2018లోని సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్. భవ్య కిషోర్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వీఆర్వో నాగేశ్వరరావు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ర్యాలి గ్రామానికి చెందిన చిన్నం లక్ష్మీ ప్రసన్న తనకు సంబంధించిన ర్యాలి గ్రామం సర్వే నంబర్ 381/6లోని ఎకరం 0.09 సెంట్ల భూమి మ్యుటేషన్ దరఖాస్తును ప్రాసెస్ చేసి, తదుపరి చర్యల కోసం పంపించేందుకు వీఆర్వోను సంప్రదించారు. ఈ అధికారిక పని చేయడానికి వీఆర్వో రూ.16,500 లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. ఈ మేరకు శనివారం సాయంత్రం సుమారు 4:50 గంటలకు ర్యాలి గ్రామ సచివాలయంలో ఫిర్యాదుదారు నుంచి రూ.16,500 లంచం స్వీకరించి తన ఎడమ వైపు షర్టు జేబులో పెట్టుకున్న



సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి వీఆర్వోను పట్టుకున్నారు. వీఆర్వో షర్టు జేబులో నుంచి రూ.16,500 లంచం సొమ్మును మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో చేతులకు రసాయన పరీక్ష నిర్వహించగా కుడి చేతికి పాజిటివ్ ఫలితం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుకు సంబంధించిన అధికారిక పని దస్త్రాన్ని కూడా వీఆర్వో వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పోస్ట్ ట్రాప్ ప్రక్రియ కొనసాగుతోందని ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్. భవ్య కిషోర్ తెలిపారు.

## సి సి టీవి పుటేజీ ఆధారంగా హత్య కేసు ను చేదించిన గాలివీడు పోలీసులు




### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్

**రాయచోటి ఆగస్టు 29 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గాలివీడు హత్య కేసు వివరాలను వెల్లడించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త బాలకృష్ణను దారుణంగా హత్య చేసిన భార్య చిన్నక్క, ఆమెకు సహకరించిన సన్నిహితుడు కడప రఫీ, మరియు నవీన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో కొనసాగిన దర్యాప్తులో, ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేని ఈ కేసును 100కు పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలతో పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాలతో ఈ కేసును ఛేదించిన సీఐ హెచ్. కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ జె. నరసింహారెడ్డి, బి.శివకుమార్,సిసిఎస్ ఏఎస్ఐ సర్దార్ కానిస్టేబుళ్లు మహేంద్ర నాయుడు, బర్కత్ లను ఎల్ఆర్ పల్లి సర్కిల్ పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





**ప్యాపిలి (ప్రజాజ్యోతి న్యూస్) ఆగస్టు 29** ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి 33 గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ పైప్లైన్ పంప్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గౌరవనీయులు డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు పంప్ హౌస్‌ను ప్రారంభించి, వాటర్ గ్రిడ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఈ ప్రాజెక్టు ద్వారా డోన్ మరియు ప్యాపిలి మండలంలో 33 గ్రామాల ప్రజలకు నాణ్యమైన తాగునీరు నిరంతరాయంగా అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని ఆయన తెలిపారు. దీర్ఘకాలంగా స్వచ్ఛమైన తాగునీటి కోసం ఎదురుచూస్తున్న గ్రామాల ప్రజలు ఈ ప్రాజెక్టు ప్రారంభం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి ఈ కీలకమైన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్న ఎమ్మెల్యే గారి సేవలను వారు అభినందించారు. ఏనుగుమర్రి టిడిపి నాయకులు మెపూరి రామకృష్ణ, అరిగెల శంకర్, మెపూరి రాము, గ్రామప్రజలు పాల్గొన్నారు

# కింగ్ 100 గ్లింప్స్ విడుదల.. పవర్ ఫుల్ డైలాగ్‌తో హీరో పరిచయం




అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్–టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

# ఓటీటీలోకి మలయాళ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్.. ఇదేం ట్విస్టులు సామి!



ప్రేక్షకులందు సినిమా ప్రేక్షకులు వేరయా...అది ఆటైనా, పాటైనా ...వేడుకేదైనా, వేదికేదైనా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా కార్యక్రమం రూపుదిద్దుకుంటే మాత్రం చాలు ఆ కార్యక్రమం విజయవంతమైనట్లే. కాని సినిమా ప్రేక్షకులు మాత్రం వీటన్నిటికీ విభిన్నం. విషయాన్ని సూటిగా చెబితే సినీ ప్రేక్షకులు అలరించరు. అదే విషయానికి కాస్త మసాలా దట్టించి చెప్పాలనుకున్న విషయాన్ని వినూత్నంగా చివరాఖరిలో చెబితేనే సినిమా అలరిస్తుంది. మరీ ముఖ్యంగా ఇప్పటితరం వైవిధ్యానికి పెద్ద పీట వేస్తోంది.ఆ నేపథ్యంలో వచ్చిన సినిమా ఉయిర్. ప్రముఖ ఓటీటీ సంస్థ జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇదో క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇది మళయాళ సినిమా అయినా హాట్ స్టార్ లో తెలుగులోనూ లభ్యమవుతోంది. ప్రముఖ మళయాళ రచయితలు షాజీ, నిఖిల్ రాసిన కథకు పద్మకుమార్ ప్రాణం పోసిన సినిమానే ఉయిర్. ఈ సినిమా ప్రారంభం నుండి శుభం కార్డు వరకు ప్రేక్షకుడిలో అమితాసక్తిని రేకెత్తిస్తూ ఆఖరి సన్నివేశం వరకూ ఉత్కంఠ రేపుతుంది. అంతలా ఈ సినిమా కథలో ఏముందో ఓ సారి చూద్దాం. కేరళలోని కన్నూర్ సమీప ప్రాంతంలో ఉన్న ఓ పాడుబడిన బావిలో కుళ్ళిపోయిన స్థితిలో ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం బయటపడటంతో కథ ప్రారంభమవుతుంది. కొత్తగా విధుల్లో చేరిన సబ్‌ఇన్‌స్పెక్టర్ అజీబ్‌కు ఈ కేసు దర్యాప్తు బాధ్యత అప్పగిస్తారు. సీనియర్ పోలీస్ ఆఫీసర్ జాయ్ పర్యవేక్షణలో అజీబ్ తన మొదటి పెద్ద కేసుగా దీన్ని తీసుకుంటాడు. ప్రారంభంలో ఎలాంటి క్లూస్ దొరకకపోయినా, ఆ శవం వేసుకోనున్న బట్టలు, చేతి గాజుల ఆధారంగా ఆ మహిళ కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిన వలస కార్మికురాలు 'శోభ' అని గుర్తిస్తారు.విచారణ ముందుకెళ్ళేకొద్దీ ఇది సాధారణ హత్య కాదని దీని వెనుక పెద్ద మోసపూరిత కుట్ర దాగుందని అజీబ్ కు అర్థమవుతుంది. శోభ హత్య సమయంలో తప్పిపోయిన శోభ పిల్లల గురించి అజీబ్ ఆరా తీస్తుంటాడు. మరో వైపు అజీబ్‌కు చిన్నతనంలోనే తన సొంత చెల్లెలు తప్పిపోయిన చేదు జ్ఞాపకం నిరంతరం వెంటాడుతూ ఉంటుంది. దానికి ఈ హత్యకు ఓ లింకు కూడా ఉంటుంది. మరి శోభను హత్య చేసిన అసలు నేరస్థుడిని అలాగే శోభ పిల్లలను అజీబ్ వెతికి పట్టుకుంటాడా లేదా అన్నది మాత్రం ఉయిర్ సినిమాలోనే చూడాలి. ఈ సినిమా స్క్రీన్ ప్లే మాత్రం ఊహకందని రీతిలో పరిగెడుతుంది. మస్ట్ వాచ్ థ్రిల్లర్ ఫర్ ది వీకెండ్.



# ఆగని 'ఇరుముడి' జోరు.. ఇప్పటివరకు కలెక్షన్స్ ఎంతంటే?

చీకటి తర్వాత వెలుగు రావడం ఎంత సహజమో.. వరుస పరాజయాల తర్వాత ఓ విజయం పలకరించడం కూడా అంతే సహజమని మరోసారి నిరూపించాడు మాస్ మహారాజా రవితేజ. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ హీరోకు ఎట్టకేలకు 'ఇరుముడి'తో హిట్ దొరికింది. అది కూడా మాములు హిట్ కాదు.. బ్లాక్ బస్టర్.సినిమా రిలీజై వారం రోజులు గడిచినా ఇప్పటికే ప్రేక్షకులు ఈ సినిమా కోసం థియేటర్స్‌కి పోటెత్తున్నారు. దీంతో కలెక్షన్స్ కూడా భారీగా పెరిగిపోతున్నాయి. సినిమా రిలీజ్ అయిన నాలుగు రోజుల్లో ఏకంగా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఇక ఇప్పుడు రూ.150 కోట్ల క్లబ్‌లో చేరింది. ఇప్పటి వరకు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 150 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

**అప్పుడెప్పుడో రూ. 100 కోట్లు..**

రవితేజ ఖాతాలో రూ. 100 కోట్ల వసూళ్ల సినిమా పడి చాలా కాలమైంది. 2022లో వచ్చిన ధమాకా ఒక్కటే సెంచరీ కొట్టింది. ఆ తర్వాత చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడ్డాయి. ఈ నాలుగేళ్లలో ఆయన 6 సినిమాలు చేస్తే.. వాటిలో ఏ ఒక్కటి కూడా హిట్ టాక్‌ని సంపాదించుకోలేదు. కొన్ని సినిమాలు అయితే కనీసం రూ. 10 కోట్ల వసూళ్లను రాబట్టలేదు. చాలా కాలం తర్వాత ఇప్పుడు ఇరుముడితో హిట్ కొట్టి.. పాత లెక్కలన్నీ సరిచేశాడు. మరి ఇకపై ఈ మాస్ మహారాజ సినీ జర్నీ ఎలా ఉంటుందో చూడాలి.




# వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'లో అదిరిపోయే సర్‌ప్రైజ్.. ఆ పాటని రీమిక్స్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న సినిమా కావడంతో వెంకీ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ముందుగా అనుకున్న సమయానికి విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని అనుకోని కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం మేకర్స్ సినిమాను అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకటేష్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'కూలీ నెం.1' చిత్రంలోని సూపర్ హిట్ పాట 'దండాలయ్య ఉండ్రాలయ్య'ను 'ఆదర్శ కుటుంబం' కోసం కొత్తగా రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. 'కూలీ నెం.1' సినిమాలో వెంకటేష్‌పై చిత్రీకరించిన 'దండాలయ్య ఉండ్రాలయ్య' పాట ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ముఖ్యంగా వినాయక చవితి సమయంలో గణేష్ మండపాల వద్ద ఈ పాట వినిపిస్తూనే ఉంటుంది. తరతరాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ఈ పాటకు ఇప్పటికీ ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పుడు అదే చార్ట్‌బస్టర్ పాటను 'ఆదర్శ కుటుంబం' కోసం రీమిక్స్ చేయనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. త్రివిక్రమ్ తనదైన శైలిలో ఈ పాటను ఎలా ప్రెజెంట్ చేస్తారు? అసలు కథలో ఈ పాటను ఏ సందర్భంలో ఉపయోగించబోతున్నారు? అనే అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. పాత పాటలోని మ్యాజిక్‌ను అలాగే ఉంచుతూ, కొత్త తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా సరికొత్త మ్యూజిక్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ రీమిక్స్‌ను రూపొందించే అవకాశం ఉందని టాక్. ముఖ్యంగా వెంకటేష్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ సాంగ్ వస్తే థియేటర్లలో మంచి సందడి నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన అందాల భామ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. వెంకటేష్‌తో ఆమె కాంబినేషన్ ప్రేక్షకులకు కొత్తగా ఉండబోతోంది. ఇప్పటికే పలు చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి.. ఈ సినిమాలో కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ మార్క్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌కు శ్రీనిధి పాత్ర ఎలా తోడ్పడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# కీర్తి సురేష్‌తో కలిసి నాని మాస్ స్టెప్పులు

## 'యెష నాగుల కట్ట మీద' లిరికల్ వీడియో సాంగ్ రిలీజ్




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ మరో అదిరిపోయే మాస్ అప్‌డేట్ ఇచ్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి "యెష నాగుల కట్ట మీద.. యేసె ఉయ్యాల" సాంగ్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా లిరికల్ వీడియోను వదిలింది. పూర్తి లిరికల్ వీడియో సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అచ్చమైన తెలంగాణ జానపద బాణీలో సాగే ఈ పాటలో కీర్తి సురేష్ స్పెషల్ అప్పీరెన్స్ ఇచ్చి నానితో కలిసి ఊరమాస్ స్టెప్పులతో అదరగొట్టారు. కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం ఈ పాటకు మరింత ఊపునివ్వగా, జంగి రెడ్డి, ప్రభా తమ శక్తివంతమైన గొంతుతో పాడి ప్రాణం పోశారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఈ సాంగ్ ద్వారా అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయి. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,